తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట

జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్

శుక్రవారం
22, మే, 2026

# పోక్సో బాధితులకు ఒకేచోట అన్ని సేవలు అందించడమే భరోసా కేంద్రం ముఖ్య ఉద్దేశం

**- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి**
**- ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యం మరియు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి**
**- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**
**- తెలంగాణ భరోసా కేంద్రాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి**
**- జోగులాంబ గద్వాల జోన్ డిఐజి ఎల్ ఎస్ చౌహాన్**
**- వనపర్తిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రం, జిమ్ సెంటర్‌ను ఘనంగా ప్రారంభం**

**వనపర్తి బ్యూరో మే 21 (జనంసాక్షి):**
పోక్సో కేసుల బాధితులకు తదుపరి మానసిక క్షోభ కలగకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన భద్రతను కల్పిస్తూ భరోసా కేంద్రాలు అండగా నిలుస్తున్నాయని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి పేర్కొన్నారు.గురువారం వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో డీఎస్పీ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన "భరోసా సెంటర్" మరియు ఏఆర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నా రెడ్డి, తూడి మేఘా రెడ్డి,ఎల్ ఎస్ చాహన్ ముఖ్య అతిథులుగా హాజరై భరోసా కేంద్రం మరియు జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. వీరితోపాటు ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, అదనపు ఎస్పీ రాజేష్, ఏఆర్ అదనపు ఎస్పీ వీరారెడ్డి, మీనా తదితరులు పాల్గొన్నారు.

**ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి మాట్లాడుతూ..**



మహిళలకు భరోసా కల్పించడమే భరోసా కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. హింస, వేధింపులు మరియు లైంగిక దాడులకు గురైన మహిళలు, పిల్లలకు తక్షణ సహాయం, రక్షణ అందించేందుకు తెలంగాణ పోలీస్ విభాగ ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన 'భరోసా కేంద్రాలు' అద్భుతమైన ఫలితాలను ఇస్తున్నాయ న్నారు. బాధితులకు ఒకే చోట అన్ని రకాల సేవలను అందించే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా వీటిని విస్తరిస్తున్నట్లు తెలిపారు. మద్యం సేవించడం వల్లే అనేక వేధింపులు, సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని పేర్కొంటూ, ప్రజలు తమ అలవాట్లను మార్చుకుని మద్యం సేవనాన్ని తగ్గించాలని సూచించారు. "హెల్త్ ఈజ్ వెల్త్" అని పేర్కొంటూ ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని కోరారు. పాత భవనాలను పునరుద్ధరించి వినియోగించడం కూడా మంచి అలవాటని తెలిపారు.

**ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ..**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక క్రీడా వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక దారుఢ్యం ఎంతో అవసరమని తెలిపారు. నల్లచెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద రెండు జిమ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

**ఈ సందర్భంగా డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ మాట్లాడుతూ..**



పోక్సో కేసుల బాధితులకు ఒకే చోట న్యాయ సహాయం, మాన సిక భరోసా కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం 2018లో భరోసా కేంద్రాలను ప్రారంభించిందన్నారు. ఈ విధానం ఇతర రాష్ట్రాలకు కూడా ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ వారికి అవసరమైన సహాయం అందించడం భరోసా కేంద్రాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. అలాగే జిల్లా కలెక్టర్ సహకారంతో ఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో జిమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు.

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ...**



పోలీసులు, యువత జిమ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవా లని సూచించారు. భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రుల చుట్టూ తిరిగే అవసరం లేకుండా ఒకే వాతావరణంలో వైద్యం, చట్టపరమైన సహాయం, మానసిక కౌన్సెలింగ్, పునరావాసం కల్పిస్తున్నట్లు తెలిపారు.

**ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ...**



పోక్సో రేప్ కేసుల బాధితులకు తదు పరి మానసిక క్షోభ కలగకుండా, వారి గోప్యతను కాపాడుతూ తగిన భద్రత ను భరోసా కేంద్రాలు చేకూరుస్తున్నాయన్నారు. తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఐజి చారు సిన్హా నేతృత్వంలో రాష్ట్రంలో మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత పోలీసుశాఖ కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక క్రీడా, యువజన వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో పోలీస్ జట్టు విజేతగా నిలవగా, ఉపాధ్యాయుల జట్టు రన్నరప్‌గా నిలిచింది. అనంతరం పోలీసు సిబ్బందికి నూతన క్యాప్స్‌ను పంపిణీ చేశారు.డీఎస్పీలు బాలాజీ నాయక్, గిరి ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి ఇతర అధికారులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భారాస..మౌనం.!?

**- మాజీ ఎమ్మెల్యే.. వస్తేనే సందడి**

**పాపన్నపేట, మే 21 (జనంసాక్షి) :**
జిల్లాలో అసలే పెద్ద మండలం ప్రశ్నించాల్సిన ప్రధాన ప్రతిపక్షం హస్తంతో స్నేహానికి మొగ్గు చూపుతోంది .!? నాటి తెరాస నేటి భారాస రెండు సార్లు గెలిచి అధికారంలో ఉన్నపుడు పాపన్నపేట మండలంలో గులాబీ నాయకులు అధికారాన్ని అనుభవించి అధికారం కోల్పోయక తమ సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. చైర్మన్‌లు, సర్పంచ్‌లు, సీనియర్ నాయకులు అధికార పార్టీని ప్రశ్నించే సందర్భం ఉన్న నాయకుల మధ్య సమన్వయం కొరవడి ముందుకు వెళ్ళలేని పరిస్థితి ఏర్పడింది. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక ముఖ్య నాయకుడు కారు దిగి హస్తం పార్టీలో చేరి మెదక్ అసెంబ్లీ ఎన్నికల్లో మైనంపల్లి రోహిత్ రావు గెలుపులో కింగ్ మేకర్ అయ్యారు. హరీష్‌రావు సైతం గులాబీ పార్టీలో ఉండమని అ నాయకుడిని కోరినప్పటికీ కారు పార్టీ ని వీడి కాంగ్రెస్‌ను విజయ తీరానికి చేర్చాడు. దీంతో మెదక్ అసెంబ్లీలో భారాస ఓటమికి ఇది ఒక కారణమైంది. అధికారం కోల్పోయిన అనంతరం వివిధ పరిణామాల నడుమ హస్తం పార్టీతో సర్దుబాటుకు కొందరు గులాబీ నేతలు మొగ్గు చూపిస్తున్నట్లు తెలుస్తోంది. వరిధాన్యం కొనుగోళ్లలో జాప్యం,రవాణా వాహనాల కొరతతో రైతులు ఆందోళనలు చేపడుతున్నా, నాయకులు క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ఒత్తిడి తేవడం లేదని,మౌనం వహిస్తున్నారని విమర్శలు ఉన్నాయి .! మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి వస్తేనే నేతల సందడి కనబడుతుందని ప్రజలు అంటున్నారు .!

# మహబూబ్‌నగర్ నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం

**- పోలీస్ అధికారులతో బక్రీద్ పండుగ నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**
**- రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి**
**- పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**
**- చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై నిర్విరామముగా దాడులు నిర్వహణ, అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**

**మహబూబ్‌నగర్ బ్యూరో మే 21 (జనంసాక్షి):** గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ డి.జానకి, నెలవారి నేర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిధిలో నమోదైన వివిధ నేరాలు, వాటి దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మత్తు పదార్థాల నియంత్రణ, గంజాయి మరియు అక్రమ రవాణా నివారణ చర్యలపై సమగ్రంగా సమీక్షించారు. జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు పలు సూచనలు చేస్తూ, ప్రతి కేసును నాణ్యమైన దర్యాప్తుతో త్వరితగతిన పూర్తి చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ వారెంట్లు, పీటీ వారెంట్లు, బైండోవర్ కేసులు, గ్రీవెన్స్ పిటిషన్లు, మహిళా భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్,



సీట్‌బెల్ట్ వినియోగంపై కఠిన అమలు చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిరంతరం నిర్వహించాలని తెలిపారు. జిల్లాలో మత్తు పదార్థాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తావు లేకుండా కఠిన చర్యలు కొనసాగించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులకు సత్వర సేవలు అందించాలని, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ యన్ బి రత్నం, డీఎస్పీలు, వెంకటేశ్వర్లు, రమణా రెడ్డి, బాలాజీ, ఇన్స్పెక్టర్లు అప్పయ్య , ఇజాజుద్దీన్, మొతిరాం, నాగార్జున గౌడ్, కృష్ణయ్య, సీఐలు గాంధీ నాయక్, రామకృష్ణ, ఎస్‌హెచ్‌వోలు ఐటి సెల్ ఏఎస్ఐ రాఘవేంద్ర ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు

# గాంధీ కుటుంబమంతా ప్రజల శ్రేయస్సు కోసం జీవితము అంకితం చేశారు

**- దేశ సాంకేతిక సంఘానికి బలమైన పునాదులు వేసిన మహానేత రాజీవ్ గాంధీ**

**- డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి**



**వనపర్తి బ్యూరో మే 21 (జనంసాక్షి):** రాజీవ్ గాంధీ కుటుంబమంతా ప్రజల శ్రేయస్సు కోసం పాటు పడుతూ వారి జీవితాలను ప్రజలకు అంకితం చేశారని వనపర్తి డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు.గురువారం దివంగత భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ 35 వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఉన్న రాజీవ్ గాంధీ చౌరస్తా లో ఆయన విగ్రహానికి స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి తో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ..ఆధునిక భారత నిర్మాణానికి బాటలు వేసిన రాజీవ్ గాంధీ. సాంకేతికత, టెలికాం, విద్యా రంగాల్లో సంస్కరణలతో దేశాభివృద్ధికి పునాది వేశారన్నారు.అలాగే 1984లో భారత ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్ గాంధీ, దేశంలో సాంకేతిక రంగ అభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇచ్చారు. కంప్యూటర్ రంగం, టెలికమ్యూనికేషన్ వ్యవస్థల విస్తరణకు బాటలు వేసి, సమాచార సాంకేతిక విప్లవానికి పునాది వేశారు.గ్రామీణ ప్రాంతాలకు సైతం టెలిఫోన్ సేవలు విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు.విద్యా రంగంలో నూతన వరవడితో విద్యా విధానాన్ని అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేశారు. గ్రామీణ విద్యాభివృద్ధి కోసం నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. యువతకు అవకాశాలు పెంచే దిశగా అనేక విధాన నిర్ణయాలు తీసుకున్నారు. దేశ పరిపాలనలో వికేంద్రీకరణకు ప్రాధాన్యత ఇస్తూ స్థానిక సంస్థలకు అధిక అధికారాలు కల్పించాలనే దిశగా ఆలోచనలు తీసుకువచ్చారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు చేపట్టారు. అంతేకాకుండా ఓటు హక్కు వయోపరిమితిని 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించే రాజ్యాంగ సవరణకు ఆయన కృషి చేశారన్నారు. సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి దేశ అభివృద్ధిని వేగవంతం చేయాలన్న రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం తెలంగాణ ప్రభుత్వం కూడా యువత అభివృద్ధి డిజిటల్ పురోగతి క్రీడలు మరియు ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తుందని మాట్లాడారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, జిల్లా కార్యవర్గ సభ్యులు జనార్ధన్ సాగర్, గంధం శరవంద, కోళ్ల వెంకటేష్, పలువురు కౌన్సిలర్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా వైప్ ప్రెసిడెంట్ పాండు సాగర్, యాదగిరి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## జనగణన నమోదులో సరియైన వివరాలు ఇవ్వండి : తహసిల్దార్ ఎండి ఖాజా మైనుద్దీన్



**వీపనగండ్ల, మే21 (జనంసాక్షి):** వీపనగండ్ల మండల వల్లభాపూర్ గ్రామంలో జనగణన2027 కార్యక్రమంలో భాగంగా ఎనుమరేటర్లచే ఇండ్ల గణన నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాన్ని మండల తహసీల్దార్ ఖాజా మైనొద్దీన్ సందర్శించి గ్రామస్తులకు జనగణన యొక్క ప్రాముఖ్యత, అవసరాన్ని వివరించారు.ప్రతి కుటుంబం సరైన వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో జనగణన కీలకపాత్ర పోషిస్తుందని తెలిపారు.గ్రామ ప్రజలు ఎనుమరేటర్లకు సహకరించి పూర్తి వివరాలు అందించాలని కోరారు. జనగణన సర్వేలో అపోహలు ఎవరు నమ్మవద్దని ప్రజలందరూ జనగణన సర్వేలు పాల్గొనాలని సలహా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉపాధ్యాయులు కె.బాలరాముడు,ఎనుమరేటర్లు గోవింద్,రవి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో దూసుకుపోతున్న నర్వ

**నర్వ మే21(జనంసాక్షి):** నర్వ మండల పరిధిలో మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు మండలంలోని కొత్తపల్లి గ్రామం నుండి పెద్ద కడుమూరు వరకు 4 కిమీ, రోడ్డు 4 కోట్ల రూపాయల వ్యయంతో, నాగిరెడ్డిపల్లి నుండి ఉంద్యాల వరకు 3కిమీ రోడ్డును 3,కోట్ల రూపాయలతో బీటీ రోడ్లు మంజూరి కావడం జరిగింది. పంచాయతీరాజ్ అధికారులు కొత్తపల్లి నుండి పెద్ద కడుమూర్ వరకు నాగిరెడ్డిపల్లి నుండి నంద్యాల వరకు రోడ్డు కొలతలు చేసి సర్వే చేయడం జరిగింది. బీటి రోడ్డు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చిందని రోడ్లు మంజూరి కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్, పంచాయతీ రాజ్ ఏఈ ప్రవీణ్ కుమార్ గారు, ఏఎమ్సి వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది.



## తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కో-కన్వీనర్‌గా నాచ శ్రీనివాస్ యాదవ్



**మహబూబ్‌నగర్ అర్బన్ మే21 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారుల సంఘం మహబూబ్నగర్ జిల్లా కో కన్వీనర్‌గా నాచ శ్రీనివాస్ యాదవ్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు పిడమర్తి రవికుమార్ ఆధ్వర్యంలో నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని రాష్ట్రం కోసం ఎన్నో బలిదానాలు జరగడంతో అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ కృషి ఫలితంగానే నూతన తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. 2014 సంవత్సరం నుండి గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉద్యమకారులను కేసీఆర్ ప్రభుత్వం నట్టేట ముంచిందని వాపోయారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఉద్యమకారుల కమిటీ ఏర్పాటుచేసి వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించాలని నిర్ణయాన్ని తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని వారు అన్నారు. అదేవిధంగా తమపై నమ్మకం ఉంచి ఉన్నతమైన పదవి కట్టబెట్టడంతో మిగతా ఉద్యమకారులందరినీ సమానస్థాయిలో కలుపుకొని పోయి అందరికీ న్యాయం చేయకురేలా కృషి చేస్తానని వారు తెలిపారు. జూన్ 21వ తేదీన రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో జరిగే సమ్మేళనాన్ని ఉద్యమకారులందరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు తెలిపారు.

## నూతన మార్కెట్ కమిటీ సభ్యులు తలకొండ రఘునాథ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పెద్దమందడి, 21మే (జనంసాక్షి):** పెద్దమందడి, ఘనపురం మండల నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించటం పాలక వర్గంలో స్థానిక మండల కేంద్రానికి చెందిన తలకొండ రఘునాథ్‌ను సభ్యులుగా నియమించడం పట్ల కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు, గురువారం స్థానిక గ్రామ సభ సమావేశంలో అనంతరం గ్రామ పంచాయతీ పెద్దలు నాయకులు రఘునాథ్‌ను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రజా సేవలో మమకామై ప్రజల మన్ననలు పొందాలని స్థానిక నాయకులు సత్తిరెడ్డి, స్థానిక సర్పంచ్ గంగమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్.పి.టి వెంకటస్వామి, ఉప సర్పంచ్ ఉశన్న, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, వాకిటి నరేష్, సత్యనారాయణ, సూర్యవంశం రవి, సూర్యవంశం రాఘవేందర్, రవి, రాధాకృష్ణ, రజక సంఘం నాయకులు టి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

## ఖిల్లాలో ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు టి.సాయి చరణ్ రెడ్డి**



**ఖిల్లా ఘనపురం 21మే (జనంసాక్షి):** మండల కేంద్రంలోని స్థానిక ప్రయాణికుల ప్రాంగణంలో గురువారం రాజీవ్ గాంధీ జయంతి వేడుకలను స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఇట్టి కార్యక్రమానికి డి సి సి ఉపాధ్యక్షులు టి సాయి చరణ్ రెడ్డి పాల్గొని రాజీవ్ గాంధీ చిత్ర పటానికి పూలమాలలు ఘనంగా నివాళాలు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విజయ్ కుమార్, సింగల్ విండో అధ్యక్షులు మురళీధర్ రెడ్డి, సింగల్ విండో ఉపాధ్యక్షులు క్యామ రాజు,దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడవత్ రవి నాయక్, ఆగారం ప్రకాష్,డీలర్ రమేష్,వార్డు సభ్యులు లింగ స్వామి,క్యామ శ్రీ రాములు,కమలొద్దిన్ పూర్ సర్పంచ్ గోపాల్ యాదవ్, మునగాల బాబు, వెంకటరెడ్డి ,గోపాల్ నాయక్, యాదయ్య, బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బతో ఉపాధి హామీ కూలీ మృతి



**ఇటిక్యాల, మే 21 (జనంసాక్షి):** ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్లిన ఓ వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందినట్లు గ్రామస్తులు, అధికారులు తెలిపారు. ఇటిక్యాలకు చెందిన కల్వకుంట్ల కొండారెడ్డి (70) గురువారం ఉదయం రోజు మాదిరిగానే ఉపాధి హామీ కూలీ పనులకు వెళ్ళాడు. పనులు చేస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురైన కొండారెడ్డి ఇంటికి వెళ్లి నీళ్లుతాగి కుప్పకూలి పడిపోయాడు. స్థానికులు పరిశీలించగా ఎలాంటి చలనం లేకపోవడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఇటిక్యాల తహాశీల్దార్, డాక్టర్, అధికారులు కొండారెడ్డి కుటుంబాన్ని ప్రమర్శించి పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ఇటిక్యాల సర్పంచు దేవేందర్ రెడ్డి, ఏపీఓ శరత్, డీలర్ రవీందర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

## మాజీ ప్రధాని, స్వర్గీయ శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమం



**కోహెడ మే21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కోహెడ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మంద ధర్మయ్య అధ్యక్షతన మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన రాజీవ్‌గాంధీ భారతదేశానికి ఎన్నో గొప్ప సంస్కరణలు తీసుకువచ్చారన్నారని గుర్తు చేశారు. శ్రీలంక దేశానికి సంబందించిన ఉగ్రవాద సంస్థ అతన్ని లక్ష్యంగా చేసుకుని ఎన్నికల ప్రచారంలో మానవ బాంబుతో అతన్ని చంపారని అన్నారు.రాజీవ్ గాంధీ మరణంతో మన దేశం ఒక గొప్ప నాయకున్ని కోల్పోవడంతో దేశం చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వచ్చిందని అన్నారు. అలాగే అతని యొక్క ఆలోచన విధానాలు ఇంకా ముందుకు తీసుకు వెళ్లాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ బోయిని నిర్మల - జయరాజు, వైస్ చైర్మన్ అలాగే డైరెక్టర్ లు వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యూఐ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక

# జిల్లాస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**- కలెక్టర్ ప్రియాంక**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

**నారాయణపేట జిల్లా బ్యూరో మే 21(జనంసాక్షి):** నారాయణపేట జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 22న ఉదయం 9:30 గంటలకు నిర్వహించే జిల్లాస్థాయి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఒక ప్రకటనలో కోరారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్యశాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి హాజరవుతున్నారనీ తెలిపారు. జిల్లాస్థాయి

## టిఆర్ఎస్ జెండా పండుగను ఘనంగా నిర్వహిద్దాం

**నారాయణపేట మే21 (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న పార్టీ జెండా ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షులు గావినోళ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు చందు పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీకి జిల్లాలో అన్ని వర్గాల ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోందన్నారు. మహిళలు, యువత, రైతులు, నిరుద్యోగులు, ఉద్యమకారులు పెద్దఎత్తున పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ఇప్పటికే జిల్లాలోని 28గ్రామాల్లో పార్టీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుండి వచ్చే నెల 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా గ్రామాలు, మండల కేంద్రాలు, నాలుగు మున్సిపాలిటీల్లో జెండా ఆవిష్కరణ పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి విద్యార్థికి ఉచితవిద్య, ప్రతి పేద కుటుంబానికి ఉచిత వైద్యం అందిస్తామని తెలిపారు. సామాజిక న్యాయం, రైతు సంక్షేమం కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తామని,



యువతకు నాలుగు లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. స్వయం ఉపాధి కోసం బ్యాంకులతో సంబంధం లేకుండా ప్రభుత్వమే రూ.20కోట్ల వరకు రుణ సహాయం అందించే విధానాన్ని తీసుకువస్తామని పేర్కొన్నారు. మిగిలిన ఎకరాలకు కూడా రైతు భరోసా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చౌక్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి, అనంతరం కలెక్టర్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజకవర్గం ఇంచార్జి నీలి జనార్దన్, కొత్త పల్లి మండలం అధ్యక్షులు శివ శంకర్, ఖాజీపూర్ వెంకటప్ప ఆశన్ పల్లి నారాయణ రెడ్డి, విట్లపూర్ భీంశప్పలతో పాటు జిల్లా నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కులగణనపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం..

**- బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి మోడల శ్రీనివాస్ సాగర్**

**మహబూబ్‌నగర్ ప్రతినిది మే21 (జనంసాక్షి):** జనగణనలో బీసీ కులగణన చేపట్టవచ్చని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని సుప్రీంకోర్టు తీర్పు కులగణన వ్యతిరేకులకు చెంపపెట్టు లాంటిదని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ సాగర్ అన్నారు.. బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుతోనైనా కేంద్రం ఓబీసీ కుటుంబాలను లెక్కించాలన్నారు. దేశవ్యాప్తంగా బీసీ జనాభాను లెక్కించాలని, జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు దక్కాలని బీసీ సమాజాలు చేసిన పోరాట ఫలితమే ఈరోజు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు అని ఆయన తెలిపారు. దేశంలో సామాజిక, రాజకీయ, ఆర్థిక అసమానతలు సరి చేయడానికి కులగణన ఎంత అవసరమని, ప్రభుత్వాలకు సంక్షేమ విధానాలను రూపొందించేందుకు కులాల వారిగా లెక్కల అవసరమని సర్వోన్నత న్యాయస్థానం చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. వెనుకబడిన వర్గాలకు వారి జనాభా దామాషా ప్రకారం




న్యాయం జరగాలంటే సమగ్ర కులగణన తప్పనిసరి అన్నారు.. కులగణన చేస్తామని హామీ ఇచ్చి కేంద్ర ప్రభుత్వం బీసీలను మోసం చేయాలని చూసిందని, సుప్రీంకోర్టు తీర్పుతో నైనా కేంద్ర ప్రభుత్వం తమ మనసు మార్చుకుని ప్రస్తుతం మొదటి దప జరుగుతున్న కుటుంబాల లెక్కింపులో బీసీ కుటుంబాల లెక్కింపు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ జనాభా లెక్కలను సుప్రీంకోర్టు సమర్థించినందుకు సుప్రీంకోర్టుకు ప్రత్యేక ధన్యవాదాలు మోడల శ్రీనివాస్ సాగర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సమాజ్ యూత్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాలమూరు వెంకటేష్ గౌడ్, బీసీ సమాజ్ పట్టణ అధ్యక్షుడు బోయ నరసింహా, అశ్విని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలి

**- ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిది మే21 (జనంసాక్షి):** సిఎం రిలీఫ్ ఫండ్‌ను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మహబూబ్ నగర్ హన్వాడ మండలాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు ఆయన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యం చేయించుకొన్న వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రైవేట్ హాస్పిటల్స్‌లో చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద ప్రజలకు సహాయం అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. అర్హులైన లబ్ధిదారులు తమ వైద్యానికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు (బిల్లులు, మెడికల్ రిపోర్టులు) మా కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. సమర్పించిన పత్రాలను పరిశీలించి, ప్రాసెస్ చేసి, ప్రభుత్వానికి (సెక్రటేరియట్) పంపించి వారికి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ద్వారా కొన్ని వేలమంది లబ్ధి పొందగా, మరింత మంది ప్రజలకు ఉపయోగపడేలా విస్తరిస్తున్నామని చెప్పారు. క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా నలుగురు సిబ్బంది సిఎం రిలీఫ్ ఫండ్ కోసమే పనిచేస్తున్నారని, అదనంగా హైదరాబాద్‌లో కూడా సహాయం కోసం ఇద్దరు పనిచేస్తున్నారని తెలిపారు. పార్టీలకు అతీతంగా అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలు, ప్రజలు కలిసి ఈ కార్యక్రమాన్ని ప్రతి గ్రామానికి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. మీ పరిసరాల్లో ప్రైవేట్ హాస్పిటల్స్‌లో వైద్యం పొందుతున్న పేద కుటుంబాల వివరాలు, డాక్యుమెంట్లు సేకరించి మా కార్యాలయంలో అందించాలని సూచించారు. పేదలకు వైద్య సహాయం అందించడంలో



ఎలాంటి లోటు లేకుండా ప్రతి ఒక్కరికీ అండగా నిలబడటం మా లక్ష్యం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, నాయకులు సుధాకర్ రెడ్డి, చెన్నయ్య, మోహన్ రెడ్డి, ధర్మాపూర్ నర్సింహారెడ్డి, అబ్దుల్ హక్, గోవింద్ యాదవ్, చంద్రమౌళి, కేశవులు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



**వనపర్తి బ్యూరో మే21 (జనంసాక్షి):** గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన పలువురు బాధిత కుటుంబాలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి గురువారం పరామర్శించారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు గుండె నొప్పితో మృతి చెందిన ఆర్టీసీ డ్రైవర్ చంద్రశేఖర్ గారి మృతదేహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. చంద్రశేఖర్ గారి ఉద్యోగరీత్యా ఏదైనా అవసరం ఉన్న తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలియజేయవలసిందిగా కుటుంబ సభ్యులను ఆయన సూచించారు. కార్యక్రమంలో గోపాల్పేట మండల మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు సత్యశీలరెడ్డి, వనపర్తి పట్టణ అధ్యక్షులు శివన్న, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి చిన్నారిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి

**- ఎంఈఓ సురేష్**




**మల్దకల్ మే21 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని పి.యం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం - 2026 విజయవంతం చేయుటకు అంగన్వాడీ టీచర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులతో గురువారంప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాధికారి జి.సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు,నాణ్యమైన విద్య, ప్రతి చిన్నారిని పాఠశాలలో చేర్పించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రిజ్వాన, బజారన్న, మునెప్ప, లక్ష్మి, అంగన్వాడీ సిబ్బంది లక్ష్మీ రంగమ్మ పాల్గొన్నారు.

## జిల్లాస్థాయి ఫోటోగ్రఫీ పోటీలు

**గద్వాల నడిగడ్డ, మే 21 (జనంసాక్షి);** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న యువజన వారోత్సవాల సందర్భంగా జిల్లా కలెక్టర్,మేజిస్ట్రేట్, జోగులాంబ గద్వాల జిల్లా ఆదేశాల మేరకు యువజన, క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఫోటోగ్రఫీ పోటీలు నిర్వహించబడనున్నాయి. జిల్లాలోని యువత, ఫోటోగ్రఫీ అభిరుచి కలిగిన వారు తమ సృజనాత్మక ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ప్రకృతి దృశ్యాలు, పక్షుల జీవ వైవిధ్యం,అటవీ ప్రాంతాలు, వారసత్వ కట్టడాలు,సాంస్కృతిక సంప్రదాయాలు, పర్యాటక ప్రాంతాలు, గ్రామీణ జీవన విధానం,ఆసక్తి గల అభ్యర్థులు తమ ఫోటోలు, పూర్తి వివరాలను ఈనెల 22 సాయంత్రం లోపు జిల్లా ప్రజా సంబంధాల అధికారి కార్యాలయం, జోగులాంబ గద్వాల జిల్లాకు పంపించాలని తెలియజేయడమైనది. ఫోటోలు, అభ్యర్థి వివరాలను జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ అధికారిక ఈ-మెయిల్ dpro.jogulamba.tg@gmail.comకు పంపవలెను. ప్రథమ బహుమతి రూ. 5,000/-,ద్వితీయ బహుమతి రూ. 3,000/-,తృతీయ బహుమతి రూ. 2,000/-,జిల్లాలోని యువత, విద్యార్థులు, ఫోటోగ్రఫీ ప్రియులు, ప్రకృతి ప్రేమికులు పెద్ద సంఖ్యలో పాల్గొని యువజన వారోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ మేజిస్ట్రేట్ కోరారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి గౌడ బిడ్డకు లైసెన్స్ ఇవ్వాలి

**- ముస్మీర్ పర్శరాములు గౌడ్**
**- సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రటరీ**



**సిద్దిపేట మే 21 (జనంసాక్షి):** 18 సంవత్సరాలు నిండిన ప్రతి గౌడ బిడ్డకు లైసెన్స్ ఇవ్వాలని జై గౌడ సిద్దిపేట జిల్లా జనరల్ సెక్రెటరీ పర్శరాములు గౌడ్ అన్నారు. 2న తెలంగాణ వ్యాప్తంగా కొత్త పెన్షన్లు మంజూరు చేస్తున్న సందర్భంగా గౌడ కులానికి చెందిన ప్రతి యువకుడికి గౌడ కుల ధృవీకరణ పత్రాన్ని ఆధారంగా తీసుకొని లైసెన్స్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌడ బిడ్డ పుట్టుకతోనే వృత్తితో అనుబంధం కలిగి ఉంటాడని, తాటిచెట్లు ఎక్కిన వారికే కాకుండా గౌడ కుల సర్టిఫికెట్ ఉన్న ప్రతి ఒక్కరికీ లైసెన్స్ ఇవ్వాలని కోరారు. గౌడ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, ఆర్థికంగా బలోపేతం చేసే సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టాలని కోరారు.గౌడ సమాజ అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, గౌడల హక్కులు మరియు గౌరవాన్ని కాపాడే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# రాజీవ్ గాంధీ చిత్రపటానికి ఘన నివాళి



**మక్తల్, మే 21 (జనంసాక్షి):** దేశంలో సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసిన మహానీయుడు దివంగత ప్రధానమంత్రిరాజీవ్ గాంధీ అని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. భారత సమాచార విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయం వద్ద రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి మంత్రి వాకిటి శ్రీహరి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. దేశంలో సమాచార సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి, యువతకు నూతన అవకాశాల దారులు తెరిచిన మహానేత రాజీవ్ గాంధీ అని అన్నారు.కంప్యూటర్ విప్లవం, టెలికమ్యూనికేషన్ రంగ అభివృద్ధి, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం వంటి కీలక సంస్కరణల ద్వారా భారతదేశాన్ని ఆధునిక యుగంలోకి తీసుకెళ్లిన నాయకుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని మంత్రి కొనియాడారు. యువత శక్తిపై అపార విశ్వాసం ఉంచిన రాజీవ్ గాంధీ, దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నమ్మారని గుర్తుచేశారు. 18 సంవత్సరాల యువతకు ఓటు హక్కు కల్పించడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థలో యువశక్తికి ప్రాధాన్యం పెంచారని మంత్రి పేర్కొన్నారు. సాంకేతికతను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లి, దేశ అభివృద్ధిని వేగవంతం చేయాలన్న రాజీవ్ గాంధీ ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం కూడా యువత అభివృద్ధి, డిజిటల్ పురోగతి, క్రీడలు, ఉపాధి అవకాశాల కల్పనకు కట్టుబడి పనిచేస్తోందని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాగనూర్ మాజీ ఎంపిపి శ్రీనివాస్ రెడ్డి, మంథన్ గోడ్ సర్పంచ్ కె.రాజేందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, బోయ రవికుమార్, ఫయాజ్, వాకిటి హనుమంతు, అశోక్ గౌడ్, వాకిటి శ్యామ్, నేరడగొం ఆనంద్, రాజప్ప గౌడ పాల్గొన్నారు.

# కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**- రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి**



**మక్తల్, మే 21 (జనంసాక్షి):** కర్ణాటక సరిహద్దున ఉండడమే కాకుండా అన్ని రంగాల్లో పూర్తిగా వెనుకబడిన ఈ ప్రాంతంలో పేదరికం కారణంగా కంటి సమస్యలతో బాధపడుతున్న అనేకమందికి తమ వంతుగా సహకారం అందించాలని ఉద్దేశంతో నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర పశుసంవర్ధక క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. గురువారం మక్తల్ మండలంలోని రుద్రసముద్రం గ్రామంలో వాకిటి శ్రీహరన్న సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో కంటి శస్త్ర చికిత్స చేసుకున్న వారికి మందులు, కళ్లద్దాలు, పండ్లు బ్రెడ్లు మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మక్తల్ నియోజకవర్గ వ్యాప్తంగా డాక్టర్ వాకిటి శ్రీహరన్న సేవా సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న ఉచిత కంటి వైద్య శిబిరాలను కంటి సమస్యలు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. నియోజకవర్గ వ్యాప్తంగా వాకిటి శ్రీహరి అన్న సేవా సమితి ఆధ్వర్యంలో ఇప్పటికే వందలాది మందికి ఉచితంగా కంటి శస్త్ర చికిత్స లు అందించామని వ్యవస్థాపకులు అల్కారి రవికుమార్ తెలిపారు. వైద్యం కోసం మంత్రి వాకిటి శ్రీహరి అహర్నిశలు కృషి చేస్తున్నారని, దసరావరకు 150పడకల ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు. మక్తల్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లింగప్ప, ఉప సర్పంచ్ రామ్ లింగప్ప, కాంగ్రెస్ నాయకులు కట్ట సురేష్ కుమార్ గుప్తా, సాలంబిన్ ఉమర్ బస్రవి తదితరులు పాల్గొన్నారు.

# గాధిర్యాల్లో ముగిసిన వీధినాటకం..

**- వీధి నాటకాల ద్వారా చరిత్రను గుర్తుచేస్తాయి**

**- నాటక పాత్రదారులకు వార్డ్ మెంబర్ భాగ్యలక్ష్మి ఘనసన్మానం**



**మహమ్మదాబాద్, మే21 (జనంసాక్షి):** మండల పరిధిలోని గాధిర్యాల్ గ్రామంలో గత ఐదు రోజులుగా కొనసాగిన మునిరంగస్వామి వీధినాటకం.నేటితో మూగియనన్నది. ఈసందర్భంగా, ఏడు, ఎనిమిదోవ వార్డు మెంబర్లు తలారి భాగ్యలక్ష్మి, జి పాండు, కళను గుర్తించి మునిరంగస్వామి వీధి నాటకంలో పాల్గొన్న.పాత్రదారులకు.శాలువతో ఘనంగా సన్మానించారు.ఈసందర్భంగా, కార్యక్రమంలో సన్ డ్రెస్ కేశవులు, పులి అనంతయ్య, దాన్నేమోని కృష్ణయ్య, ఎన్ కృష్ణయ్య, (వీధినాటక పంతులు అక్కంపేట అనంతయ్య, కృష్ణాజి తబిలిస్టు రుక్కయ్య),గ్రామస్తులు వీధి నాటక సభ్యులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు



**మల్దకల్ మే 21(జనంసాక్షి):** మండలంలో పరిధిలోని మల్లెందొడ్డి గ్రామంలో 100 రోజుల ఉపాధిహామీ పథకంలో ఉపాధి కూలీలకు మహిళాభివృద్ధి శాఖ వారి ఆధ్వర్యంలో అవేర్నెస్ ప్రోగ్రాం గురువారం ఏర్పాటు చేశారు. మహిళాభివృద్ధి సంక్షేమ శాఖ ప్రతినిధి ప్రకాష్ మాట్లాడుతూ బాలలే రేపటి పౌరులు అని పిల్లలందరినీ కూడా బడికి పంపించాలని, దేశ భవిష్యత్తు పిల్లల మీద ఆధారపడి తెలిపారు. నేటి సమాజంలో పిల్లలందరినీ కూడా విద్యావంతులు చేయాలని తల్లిదండ్రులకు తెలియజేశారు.18 సంవత్సరాల లోపు ఉన్న బాలబాలికలందరు కూడా బడిలో ఉండాలి అని తెలిపారు. అమ్మాయికి 18 సంవత్సరాలు పూర్తిగా లేని తర్వాతనే అబ్బాయికి 21 సంవత్సరం పూర్తిగా నిండిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. బాల్య వివాహం చేస్తే రెండు సంవత్సరాలు జైలు శిక్ష లక్ష రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ లైన్ కళావతి,ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మీకాంత, మెటీస్ తిమ్మప్ప,రాజేష్,ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# ఎగిరెగిరి దంచినా అదే కూలి, ఎగరకుండా దంచినా అదే కూలి - ధాన్యం రైతుల ఆవేదన

**- తరుగు, తేమ పేరుతో దోపిడి**

**- రైతు ఖాతాలలో ఇంకా జమ గాని డబ్బులు**

**- వరి కల్లాలలోని వరి ధాన్యాన్ని వర్షుడే రక్షించాలి**





**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి మే21 (జనంసాక్షి):** ఆరుగాలము కష్టపడ్డ రైతాంగం చేసేది ఏదో పద్ధతిగా, సామర్థ్యంతో చేయాలి తప్ప, అనవసరమైన ఆరాటంతో ఎక్కువ కష్టపడినా అదనపు ప్రయోజనం ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తెలంగాణలో యాసంగి ధాన్యం కొనుగోళ్లు తక్షణమే పూర్తిస్థాయిలో చేపట్టాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అకాల వర్షాలు, తరుగు, తేమ పేరుతో కొర్రీలు, ట్యాబ్ ఎంట్రీలలో జాప్యం జరుగుతుండటంతో రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వస్తోంది. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం చేరి నెలరోజులు గడిచిపోయిన తూకం వేయకపోవడం. మిల్లుల వద్ద తరుగు, తేమ పేరుతో క్వింటాలుకు అదనంగా ధాన్యం కోతకోస్తూ రైతులపై తరుగు పేరిట దోపిడీ భారం మోపుతున్నారు. అకాల వర్షాలతో కొనుగోళ్లలో జాప్యం వల్ల కేంద్రాలలో ధాన్యం కుప్పలు వర్షానికి తడిసిపోయి రైతులు నష్టపోయే ప్రమాదం ఏర్పడింది. యాసంగి పంటను, రైతు శ్రేయస్సును ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని మక్కలైన, వరి ధాన్యమైన ప్రభుత్వం ప్రకటించిన రేటుకు అనుగుణంగా మార్కెట్ యార్డులలో అన్ని రకాల వసతులు కల్పించాలని అందుకు పగడ్బందీగా వ్యవహరిస్తున్న మార్కెట్ యార్డులలో గత నెల రోజులుగా రైతుల తిప్పలు పడగాపులు చూస్తూ ఉంటే ప్రభుత్వం ఇచ్చిన హామీలను అధికారులు అమలు చేయడంలో నిర్లక్ష్యమా లేక రైతులపై చిన్న చూపా అని రైతులు వాపోతున్నారు.

ఓ పక్క మంత్రులు, రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులు రైతులు పండించిన పంట చివరి గింజ వరకు కొంటామని మాటలతో ఊదరగొడుతున్నారు. మార్కెట్ కు రైతు తెచ్చిన ధాన్యానికి, రైతుకు ఎక్కడా కూడా మౌలిక వసతులు ఏర్పాటు చేయడంలో అధికార గణం పూర్తిస్థాయిలో విఫలం అయ్యిందని, రైతాంగం గత నెల రోజుల వ్యవధిలో లబోదిబోమని మొత్తుకుంటున్నామని అంటున్నారు. కింది స్థాయిలో ధాన్యాన్ని కాంట వేయడానికి కాంటాలు,గన్ని బ్యాగులు, టార్పాళ్ళు,లారీలు,హమాలీలు,తాగడానికి నీళ్లు వీటిని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నెత్తి నోరు మొత్తుకుంటున్న ఎక్కడ ఏర్పాటు చేయనందువల్ల మాసిపోయిన బట్టలతో, పెరిగిన గడ్డాలతో మార్కెట్లలో, కల్లాలో రైతుల దుస్థితి వర్ణానాతితం. అందరి డిమాండ్ తక్షణమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతు ఖాతాలలో డబ్బులు జమ చేయాలని రైతాంగం కోరుతుంది.

# రక్తదానం ప్రాణదానం

**- రక్తదానం చేసిన యువకులు, మానవత్వాన్ని చాటారు**



**సంగారెడ్డి టౌన్ మే 21 (జనంసాక్షి):** అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళకు అత్యవసరంగా ఐదు గురు యువకులు గురువారం రక్త దానం చేసి ప్రాణదాతలుగా నిలిచారు.. సంగారెడ్డి పట్టణం ప్రైవేట్ హాస్పిటల్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మహిళాకు రక్తం తక్కువ ఉండటం వల్ల వైద్యుడు రక్తం ఎక్కించాలి అన్నారు.. దింతో కుటుంబ సభ్యులు బ్లడ్ డోనార్స్ క్లబ్ అధ్యక్షుడు బంగారు కృష్ణ కు సంప్రదించారు .. బంగారు కృష్ణ వెంటనే బ్లడ్ డోనార్స్ క్లబ్ సభ్యులు సిద్దు, పాండు, శివ, కార్తీక్, అమర్ పాల్ ను రక్త దానం చేయాలనీ అడగానే తాము రక్తదానం చేస్తాము అని కంది సమీపంలో నీ బ్లడ్ బ్యాంక్‌కు వచ్చి రక్తదానం చేసి మానవత్వం చాటుకున్నారు.. ఈ సందర్భంగా బంగారు కృష్ణ రక్త దాతలు సిద్దు, ఇందూరి పాండు, శివ, కార్తీక్, అమర్ పాల్ ను సన్మానం చేశారు.. రక్తదాతలలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు..

# ఆధునిక భారత నిర్మాణ శిల్పి రాజీవ్ గాంధీకి ఘన నివాళులు



**బెజ్జంకి,మే 21,(జనంసాక్షి):** మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో భారత సమాచార విప్లవ పితామహుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన సేవలు చిరస్మరణీయము అనీ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కెరవేణి పోచయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు గుడెల్లి శ్రీకాంత్,బెజ్జంకి ఏఎంసీ వైస్ చైర్మన్ చిలువేరు శ్రీనివాస్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు,పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## సరిహద్దుల్లో కీర్తి కిరీటాలు

**- ఒకే కుటుంబం నుండి దేశ సేవకు ఇద్దరు రక్షణ సోదరులు**

**నంగునూరు, మే 21(జనంసాక్షి):** కన్నతండ్రి కన్న కల... గడప దాటని ఆర్థిక ఇబ్బందులు... చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా గుండె నిండా దేశభక్తి... ఇవే ఆ ఇద్దరు అన్నదమ్ములను దేశాన్ని కాపాడే సైనికులుగా మార్చాయి. సిద్దిపేట జిల్లా నంగునూరు గ్రామానికి చెందిన కీర్తి సాయి రామ్, కీర్తి చందు అనే ఇద్దరు సోదరులు ఒకే కుటుంబం నుండి రక్షణ రంగంలోకి ఎంపికై నేడు దేశవ్యాప్తంగా అభినందనలు అందుకుంటున్నారు.

**తండ్రి ఆశయమే ఊపిరిగా...**

సిద్ధిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రానికి చెందిన దివంగత కీర్తి వెంకట నారాయణ, విజయ దంపతుల కుమారులు సాయి రామ్, చందు. తమ పిల్లలు గౌరవప్రదమైన యూనిఫాం ధరించి దేశానికి సేవ చేయాలనేది ఆ తండ్రి ఆశయం. ఆయన అకాల మరణం తర్వాత కుటుంబంలో ఎన్నో కష్టాలు ఎదురైనప్పటికీ, తల్లి విజయ కొడుకులకు అండగా నిలిచింది. నంగునూరులోని మామూలు ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఈ అన్నదమ్ములు, చదువుకుంటూనే తమ కుటుంబ వస్త్ర దుకాణం "న్యూ ఏజ్ మెన్స్ వేర్" లో సేల్స్‌పర్సన్‌లుగా పనిచేసి ఇంటికి ఆసరాగా నిలిచారు.

**సరిహద్దు కాపలాదారుడు : కీర్తి సాయి రామ్**

పెద్ద కుమారుడు కీర్తి సాయి రామ్ కష్టాలను చూసి వెనకడుగు వేయలేదు. తండ్రి కలని గుండెల్లో నింపుకుని కఠినంగా శ్రమించి 2021లో బీఎస్‌ఎఫ్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. జార్ఖండ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని, మూడేళ్ల పాటు గుజరాత్ సరిహద్దుల్లో విధులు నిర్వహించాడు. ప్రస్తుతం అత్యంత సున్నితమైన పశ్చిమ బెంగాల్‌లోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు (కదంతల, సిలిగురి) వద్ద దేశ రక్షణలో పహారా కాస్తున్నాడు.

**అన్న బాటలోనే తమ్ముడు : కీర్తి చందు**

అన్న సాధించిన విజయం తమ్ముడు కీర్తి చందుకు స్ఫూర్తినిచ్చింది. అన్న మార్గదర్శకత్వంలో, హైదరాబాద్‌లో ఫిజికల్ ట్రైనింగ్ తీసుకుని కఠినమైన పరీక్షల్లో నెగ్గాడు. ఈ ఏడాది (2025) లో సెంట్రల్ రిజర్వ్ పోలీస్‌ఫోర్స్‌లో కానిస్టేబుల్‌గా ఎంపికై, అమేథీలో శిక్షణ ముగించుకున్నాడు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో, అత్యంత ప్రమాదకరమైన "యాంటీ నక్సల్ ఏరియా ఆపరేషన్స్"లో చందు గర్వంగా సేవలు అందిస్తున్నాడు.



**మేము ప్రభుత్వ పాఠశాల విద్యార్థులం!**

"మేము ప్రభుత్వ పాఠశాలలో చదివి ఈ స్థాయికి వచ్చాం. మా ఎదుగుదలకు కారణమైన మా ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం" అని ఈ రక్షణ సోదరులు గర్వంగా చెబుతున్నారు. ఒకే కడుపున పుట్టిన ఇద్దరు కొడుకులు దేశ సరిహద్దుల్లో, అంతర్గత రక్షణలో తుపాకులు పట్టి దేశాన్ని కాపాడుతుంటే, ఆ తల్లి కళ్లల్లో ఆనందబాష్పాలు రాలాయి. కష్టాలను జయించి, దేశ సేవలో తరిస్తున్న ఈ 'కీర్తి' సోదరుల ప్రయాణం యువతకు ఎంతో స్ఫూర్తి దాయకం.

## భగలాముఖి శక్తిపీఠంలో హైకోర్టు న్యాయవాది పూజలు



**శివ్వంపేట మే 21 (జనంసాక్షి):** మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన భగలాముఖి శక్తిపీఠంలో బగలాముఖి అమ్మవారినీ గురువారం హైకోర్టు సీనియర్ న్యాయవాది, శ్రీ గురుఫీఠం వ్యవస్థాపక చైర్మన్ జిన్నారం పెద్దగౌని శివకుమార్ గౌడ్ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని, ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ గౌడ్ అమ్మవారికి అభిషేకం, హరిద్రార్చన వంటి పూజలు నిర్వహించారు. పూజలు ముగిసిన తర్వాత ఆలయ పూజారి కమలేష్ పండిట్ శివకుమార్ గౌడ్‌కు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది ఉన్నారు.

## శ్రీ గురుఫీఠంలో భక్తజనం పూజలు



**శివ్వంపేట మే 21 (జనంసాక్షి):** పంచమి గురువారాన్ని పురస్కరించుకుని శ్రీ దత్తాత్రేయ మహాస్వామి పంచాయతనం, గురుపరంపర దేవాలయం అలాగే శిరిడి సాయిబాబా దేవాలయంలో అర్చకులు శాస్త్రుల నటరాజు శర్మ, శ్రీ హర్షశర్మ, గురుఫీఠం చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ లు గురువారం శ్రీ మహా దత్తాత్రేయ స్వామివారికీ పంచామృతాభిషేకాలు, శతనామా అష్టోత్తరం, అర్చన హారతి సమర్పించారు. అదేవిధంగా షిరిడి సాయిబాబా ఆలయం లో పంచలోహ మూలమూర్తికీ అభిషేకం శతనామ అష్టోత్తర అర్చన, అనంతరం హారతి సమర్పించారు. ఈ పూజదూలకు వివిధ ప్రాంతాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ దత్తాత్రేయ మహాస్వామి, సాయిబాబా దేవత మూర్తులను దర్శించుకొని ఆలయాల్లో పూజలు చేపట్టి వారి మొక్కలు చెల్లించుకున్నారు. పూజలు ముగిసిన తర్వాత భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మామిడి పండ్లను పంపిణీ చేశారు. ఆ తర్వాత భక్తులందరికీ శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో శివంపేట, గూడూరు గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# దేశ చరిత్రను తిరగరాసిన నాయకుడు రాజీవ్ గాంధీ

**- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేయెన్నం శ్రీనివాస్ రెడ్డి**

**మహబూబ్‌నగర్ బ్యూరో మే21 (జనంసాక్షి):** దేశ చరిత్రను తిరగరాసిన నాయకుడు రాజీవ్ గాంధీ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. భారతదేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా అశోక్ టాకీస్ చౌరస్తా వద్ద వారి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం కన్నీరు పెట్టించిన ఆ దురదినం మన దేశ చరిత్రలో ఎప్పటికీ మరిచిపోలేని రోజు అని అన్నారు. రాజీవ్ గాంధీ యువ ప్రధానిగా దేశానికి కొత్త దిశ చూపించారని, ఆయన కళ్ళలో ప్రేమ, మాటల్లో మృదుత్వం, వ్యక్తిత్వంలో హుందాతనం స్పష్టంగా కనిపించేవన్నారు. తల్లి ఇందిరా గాంధీ హత్య అనంతరం దేశం కష్టాల్లో ఉన్న సమయంలో బాధను జీర్ణించుకుని ప్రజలను ఏకం చేసి దేశ పునర్నిర్మాణానికి ఆయన కృషిచేశారని గుర్తు చేశారు. ఆయన పాలనలో దేశ ఐక్యతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారని, నాగాలాండ్, మిజోరాం, మణిపూర్ వంటి ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి చర్చలు జరిపి, ప్రజలకు గౌరవం కల్పించే విధంగా నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. దేశాభివృద్ధికి పునాది వేసిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని, పంచాయతీరాజ్ వ్యవస్థ బలపరిచి, స్థానిక సంస్థలకు అధికారాల వికేంద్రీకరణ, కంప్యూటర్, సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం వంటివి అన్నీ ఆయన దూరదృష్టిని ప్రతిబింబిస్తాయని ఆయన చెప్పారు. భారతదేశంలో కంప్యూటర్ యుగానికి నాంది పలికిన నాయకుడు కూడా ఆయనే అని స్పష్టం చేశారు. ఈరోజు మన దేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతున్న స్థాయికి రావడానికి ఆయన వేసిన బాట ఎంతో కీలకం అని ఆయన చెప్పారు. దురదృష్టవశాత్తు ఉగ్రవాద దాడిలో ఆయన ప్రాణాలు కోల్పోయారని. మరణం దేశానికి తీరని నష్టం అని, అయినా ఆయన ఆశయాలు, సిద్ధాంతాలు మన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని ఆయన చెప్పారు. ప్రతి సంవత్సరం మే 21ను ఉగ్రవాద వ్యతిరేక దినంగా పాటిస్తూ, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ, భౌతికంగా మనతో లేకపోయినా, ఆయన చూపిన మార్గం, ఆశయాలు మనకు ఎల్లప్పుడూ ప్రేరణగా నిలుస్తాయని. ఆయన కలల భారతదేశ నిర్మాణానికి మనం అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, నగర మేయర్ గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారే పల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వినోద్ కుమార్, సిరాజ్ ఖాద్రీ, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యనిర్వహక అధ్యక్షులు అజ్మత్ అలి, కార్పొరేటర్లు రమేష్ రెడ్డి, పెద్ద గొల్ల నర్సింహులు, గులాం జహీర్, రమేష్‌బాబు, ప్రశాంత్, నాయకులు బి.మోహన్ బాబు, రియాజ్, అంజద్, గోవింద్ యాదవ్, తెలుగు గూడెం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యం అందేలా చూడాలి : తపస్



**పాపన్నపేట, మే 21 (జనంసాక్షి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువస్తున్న నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీంలో సిపిఎస్ రిటైర్డ్ ఉద్యోగులను మినహాయించడం సరికాదని తపస్ మెదక్ జిల్లా కోశాధికారి మంగ నర్సింలు పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల కోసం ప్రతిపాదించిన నూతన ఎంప్లాయీస్ హెల్త్ స్కీం అమలులో సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగుల పట్ల అవలంబిస్తున్న వివక్షను వ్యతిరేకించారు. ఉద్యోగంలో ఉన్నంత కాలం మూల వేతనం నుండి 1.5 శాతం నిధులను కట్ చేసుకుని క్యాష్‌లెస్ వైద్యం అందించి, రిటైర్డ్ అయిన మరుక్షణమే హెల్త్ కార్డులు చెల్లవనడం ఏ రకమైన న్యాయమని ఆయన ప్రశ్నించారు. ఎవరికైనా వృద్ధాప్యం లోనే వైద్యం అత్యంత అవసరమన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి,సీపీఎస్ రిటైర్డ్ ఉద్యోగులందరికీ నూతన హెల్త్ స్కీం కింద పూర్తి స్థాయి క్యాష్‌లెస్ వైద్యం అందేలా జీవోలో మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.

# జూన్ 21న హైదరాబాద్‌లో తెలంగాణ ఉద్యమకారుల సంఘం సమావేశం

**- తెలంగాణ ఉద్యమకారులకు రిజర్వేషన్ కల్పించాలి**

**- తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడమర్తి రవి**

**మహబూబ్‌నగర్ అర్బన్ మే21 (జనంసాక్షి):** స్వరాష్ట్రం 60 ఏండ్ల కల సాకారం కోసం ఉద్యమంలో పాల్గొన్న తెలంగాణ ఉద్యమకారులకు విద్యా ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పడమర్తి రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్తానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన ఆసంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ఝార్ఖండ్ రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణ ఉద్యమకారులకు రిజర్వేషన్ల కల్పించాలని కోరారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరారు. ఇంటి స్థలంలో పాటు ఇంటి నిర్మాణానికి ఆర్థంక సహాయం చేయాలని కోరారు. తెలంగాణ కోసం సర్వం కోల్పోయి తమ జీవితాన్ని త్యాగం చేశారని అలాంటి వారిని ప్రభుత్వం అన్ని విదాలుగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో తమ విలువైన సమయాన్ని, వయస్సును కోల్పొయిన వారికి ప్రతి నెల ఆసర పించన్ లాగా పించన్ సౌకర్యం కల్పించాలని కోరారు. తమ సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తెలంగాణ ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ కోసం అమరులైన వారి జాబితా, ఉద్యమంలో



గాయాలుపాలైన వారి జాబితా, ఉద్యమంలో పోలీసు కేసులు, జైళ్ల పాలైన వారి జాబితాతో పాటు ఉద్యమంలో పని చేసిన వారి జాబితాను సిద్దం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. జూన్ 21న హైదరాబాద్‌లో తెలంగాణఉద్యమకారుల సంఘం సమావేశం ఉంటుందని, ఈ సమావేశానికి మంత్రి జూపల్లి కృష్ణరావు హాజరు కానున్నట్లు తెలిపారు. అనంతరం తెలంగాణ ఉద్యమ కారుల సంఘం జిల్లా కోఆర్డినేటర్‌గా నాచా శ్రీనివాస్‌యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా అన్వర్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ రహీం, సురేష్, గోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఆధునిక భారత నిర్మాణ శిల్పి మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ

**- ఎమ్మెల్యే మేఘారెడ్డి**



**వనపర్తి బ్యూరో మే21 (జనంసాక్షి):** మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వనపర్తి పట్టణం లోని రాజీవ్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శివసేనరెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత దేశ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ఆధునిక భారత నిర్మాణ శిల్పి, యువతకు స్ఫూర్తి ప్రదాత అయిన స్వర్గీయ రాజీవ్ గారి గాంధీ ఆశయాల సాధన కోసం అందరం కృషి చేయాలని సూచించారు.
దేశాన్ని సాంకేతిక రంగంలో ముందుకు తీసుకెళ్లడంలో రాజీవ్ గాంధీ గారి పాత్ర ఎంతో కీలకమైనదని, కంప్యూటర్ విప్లవానికి నాందిపలికి, సమాచార సాంకేతికత అభివృద్ధికి బాటలు వేసిన మహానేతగా ఆయన చిరస్మరణీయులు. అని వారు ప్రశంసించారు. గ్రామీణాభివృద్ధి, విద్య, యువత సాధికారత, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ఆయన చేసిన కృషి దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. యువ భారతానికి కొత్త దిశను చూపిస్తూ దేశ అభివృద్ధి కోసం ఆధునిక ఆలోచనలతో ముందుకు సాగిన దూరదృష్టి గల నాయకుడు రాజీవ్ గాంధీ గారు. ఆయన ఆశయాలు, సేవాతత్వం నేటి తరానికి ఆదర్శప్రాయంగా నిలుస్తున్నాయి. ఈ సందర్భంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మనసారా ప్రార్థిస్తూ, ఆయన చూపిన మార్గంలో నడుస్తూ దేశ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.
అనంతరం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, వనపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పట్టపగలు దొంగల అరెస్ట్




**కృష్ణ, మే 21 (జనంసాక్షి):** కృష్ణ మండలం గుడేబల్లూరు గ్రామంలో ఈ నెల 10న కుర్వ నర్సప్ప, ఇంటికి తాళం వేసి బయటికి వెళ్లినప్పుడు ఇద్దరు దొంగలు తాళం విరగొట్టి ఇంట్లో చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసిన కృష్ణ పోలీసులు సాంకేతికత సహాయంతో దొంగలను పట్టుకున్నారు. వారు కర్ణాటక రాష్ట్రం బళ్లారి జిల్లా సిరుగుప్ప గ్రామానికి చెందిన శ్రీకాంత్, పవన్ కళ్యాణ్ అని, వారి వద్ద నుండి దొంగతనానికి ఉపయోగించిన సామాన్లు ,హెచ్ఎఫ్ డీలక్స్ బైక్, 45వేల రూపాయలు డబ్బులు సీజ్ చేసినారు. గుడెబల్లూరు గ్రామంతో పాటు రాయచూరు ఎరిగెర పోలీస్ స్టేషన్ సరిహద్దులలో కూడా వారు దొంగతనం చేసినారని వారిని గురువారం రిమాండ్ చేసినట్లు కృష్ణ ఎస్సై నవిద్ తేలిపారు.

## జూన్ 21న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం

**- గత ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు లభించని ఆదరణ**
**- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి**



**మక్తల్, మే 21 (జనంసాక్షి) :** జూన్ 21వ తేదీన హైదరాబాద్ లోని ఇందిరా పార్క్ వద్ద తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నామని, మక్తల్, నారాయణపేట ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఉద్యమకారులు తరలి వచ్చి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి కోరారు. గురువారం మక్తల్ పట్టణంలోని ఐబి వద్ద నిర్వహించిన ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు సీఎం కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వంలో కేవలం కొద్ది మందికి తప్ప.. పెద్ద స్థాయిలో ఉద్యమకారులకు సరైన ఆదరణ లభించలేదని వాపోయారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారుల కోసం కేశవరావు నేతృత్వంలో కమిటీ వేశారని, పై స్థాయిలోని నాయకులను కాకుండా అట్టడుగు స్థాయిలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమించిన ఉద్యమకారులను గుర్తించి, వారికి ఇంటి స్థలంతో పాటు ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమకారులకు తాజాగా చేపట్టిన కమిటీల్లో ప్రాధాన్యం కల్పించారని, అదేవిధంగా రాబోయే రోజుల్లో ఉద్యమకారులందరినీ గుర్తించి వారికి సరైన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ జేఏసీ ప్రెసిడెంట్ ఎండీ రహీం, బొర్రా సురేష్ , బోరెల్లి సురేష్, మీసాల మహేష్, శ్రీనివాస్, కృష్ణ, శ్రీనివాస్, మక్తల్ మున్సిపల్ వార్డు కౌన్సిలర్ మహేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ గాయత్రి అనిల్, గోలపల్లి నారాయణ, బ్యాగరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాయిపల్లి ప్రాజెక్ట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఉన్నతాధికారుల బృందం



**నారాయణఖేడ్ మే 21 (జనంసాక్షి):** నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండలం రాయిపల్లి గ్రామంలో సింగూర్ నీటి నిల్వ కొరకు ప్రతిపాదిత డ్యాం నిర్మాణ ప్రాజెక్టు పనుల్లో కీలక అడుగు పడింది. నారాయణఖే ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి ఈ యొక్క డ్యాం కొరకు ఎంతో కృషితో వారి సహకారంతో ఉన్నతాధికారుల బృందం రాయిపల్లి గ్రామంలో పర్యటించి, డ్యాం నిర్మాణ స్థలాన్ని క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక అంశాలు, నీటి నిల్వ సామర్థ్యం, భూసేకరణ మరియు డ్యాం డిజైన్‌పై సుదీర్ఘంగా చర్చించారు.
ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో నీటిపారుదల శాఖకు చెందిన పలువురు ప్రముఖ అధికారులు పాల్గొన్నారు. రాజమ్మ చీఫ్ ఇంజనీర్ పోచమల్లు సూపర్డెంట్ ఇంజనీర్ రఘునాథరావు సూపర్డెంట్ ఇంజనీర్ సుందర్, జలేందర్, విద్యా మేడం అసిస్టెంట్ ఇంజనీర్ ప్రకాష్ ఉన్నారు. స్థానిక నాయకులు, అధికారుల వెంట ఈ పరిశీలన కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని ప్రాజెక్టు ఆవశ్యకతను అధికారులకు వివరించారు. పాల్గొన్న వారిలో మాజీ సర్పంచ్ రాంచందర్, మాజీ ఎంపీటీసీ ధోండి పటేల్, మాష్ పటేల్ మరియు రాయిపల్లి గ్రామస్థులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ డ్యాం నిర్మాణం చేపడితే ఈ ప్రాంతం ఎంతో సస్యశ్యామలం అవుతుందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ, ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

# ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు

**- ప్రభుత్వ దవాఖానాలో పండ్ల పంపిణీ**

**నర్సాపూర్ మే 21 (జనంసాక్షి):** ప్రజల సంక్షేమమే అసలైన రాజకీయమని నమ్మిన యోధులు రాజీవ్ గాంధీ అని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ అన్నారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు డీసిసి అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా హత్నూర మండలం దౌల్తాబాద్ చౌరస్తాలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన నాయకుడని స్మరించుకున్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా “ఉగ్రవాద వ్యతిరేక దినం”గా పాటిస్తున్న సందర్భంగా ప్రతి భారతీయుడు హింసకు వ్యతిరేకంగా, శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాలని కోరారు. రాజీవ్ గాంధీ జీవితం, ఆయన ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలు, అభివృద్ధి, సంక్షేమ, అంశాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్ పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, కాంగ్రెస్



పార్టీ సీనియర్ నాయకుడు శ్రీధర్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రవణ్ కుమార్, జిల్లా కార్యదర్శి రవీందర్ యాదవ్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, హత్నూర మండలం అధ్యక్షులు కృష్ణ, రెడ్డిపల్లి సర్పంచ్ పద్మావతి అశోక్ గౌడ్, నాయకులు నరేష్, శివ గౌడ్, సుధీర్ కుమార్ గౌడ్, ఆంజనేయులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వరి కొయ్యలను కాల్చొద్దు

**- ఏవో లావణ్య**



**శివ్వంపేట మే 21 (జనంసాక్షి):** వరి కొయ్యలకు నిప్పుపెట్టి కాల్చితే భూసారం కోల్పోయి పంట దిగుబడి రాదని మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. గురువారం ఆమె వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి వరి కొయ్యలను సందర్శించి రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి కొయ్యలను కాల్చడం వల్ల అధికనష్టాలు వచ్చే అవకాశముందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వరికొయ్యలను తగులబెట్టొదన్నారు. వరి కొయ్యలను కాల్చడం ద్వారా భూసారం కోల్పోతుందని, వరికొయ్యలను కాల్చితే నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని చెప్పారు. కాల్చడం ద్వారా విపరీతమైన వేడితో భూమిసారాన్ని కోల్పోవడమే కాకుండా ముఖ్యంగా నత్రజని, ఫాస్ఫరస్ లాంటి పోషక పదార్థాల శాతం తగ్గుతుందని ఆమె వివరించారు. దుక్కి దున్నే సమయంలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చల్లితే అవశేషాలు రెండు వారాల్లో మురిగి పోషకాలుగా అందుబాటులోకి వస్తాయన్నారు. ఫలితంగా డీఏపీ వాడకం సగం వరకు తగ్గుతుంది. సూపర్ ఫాస్ఫేట్ చల్లితే భూమిని చౌడు బారడం నుంచి తప్పించడమే కాక భూమిలో సేంద్రియ పదార్థాల స్థాయిని పెంచుతుందని, ఇలా చేయడం వల్ల నీటి నిలువ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని అలాగే కలియ దున్నితే ఎకరాకు దాదాపుగా టన్ను వరకు ఎరువు తయారవుతుందన్నారు. ఈ కార్యక్రమం లో వ్యవసాయ విస్తరణ అధికారి మౌనిక పాల్గొన్నారు.

## భారతదేశం మాజీ ప్రధాని శ్రీ రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు



**ఎర్రవల్లి, మే21 (జనంసాక్షి):** ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఎర్రవల్లి మండల కేంద్రంలో వారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఆయనమాట్లాడుతూ యువతకు శక్తినిచ్చిన దూరదృష్టి నాయకుడు సాంకేతిక భారతానికి పునాది వేసిన మహానేత అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు వారి మిత్ర బృందం, ఎర్రవల్లి మాజీ సర్పంచ్ జోగుల రవి నాయకులు బిసన్న, వెంకటన్న, శ్రీనివాసన్ రెడ్డి, నారాయణ, జమ్మన్న, కర్రోడా అంజి, భాస్కర్, మందబలరం తదితరులు పాల్గొనారు.

## పోలీస్ స్టేషన్లో దేవర పోతు పంచాయితీ

**మల్దకల్ మే 21 (జనంసాక్షి):** జోగులాంబ గద్వాల జిల్లా మండలం మల్దకల్ మండలం మద్దెలబండ గ్రామంలో ఈనెల 26,27 తేదీలలో జరగనున్న సవరమ్మ మారెమ్మ అవ్వదేవర ఉత్సవాలు జరగనున్నాయి. గ్రామంలో గ్రామ దేవతల పేరిట దేవర దున్నపోతులను పెంచి పోషించి గ్రామంలోని విడిచిపెట్టారు. ఐదు సంవత్సరాలు తర్వాత గ్రామ దేవతలకు వాటిని బలిచి గ్రామ దేవర ఉత్సవాలను జరుపుకుంటారు. దీంతో ఒక దున్నపోతు పంచాయతీ కోసం మూడు గ్రామాల ప్రజలు గురువారము పోలీస్ స్టేషన్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇరు గ్రామాల నాయకులు పంచాయతీ నిర్వహించారు. పశు వైద్య డాక్టర్లు వచ్చి దున్నపోతు వయసును నిర్ధారణ చేశారు. చివరకు మద్దెలబండ గ్రామస్తులదే పైచేయి నిలిచింది. పోలీస్ స్టేషన్ గ్రామస్తులతో కిక్రించిపోయింది.

# పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు బాలికల నుండి దరఖాస్తులకు ఆహ్వానం

**- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల నడిగడ్డ, మే 21 (జనంసాక్షి);** శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా సాంకేతిక శిక్షణా సంస్థలో 2026-27కు పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు అర్హత గల బాలికల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ నందు 3 సంవత్సరాల పాలిటెక్నిక్ డిప్లమా కోర్సులకు 2026-27 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రుల కోల్పోయిన అనాధ బాలికలు, నిరాశ్రయులు,చైల్డ్ హోమ్స్,మహిళా సంస్థలలో ఉన్న బాలికలు,అక్రమ రవాణాకు గురైన బాధితులు , దివ్యాంగ బాలికలకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సంస్థలో సివిల్, ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్,ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీ, ల్యాండ్‌స్కేప్ డిజైన్ వంటి డిప్లొమా కోర్సులు అందుబాటులో ఉన్నాయని, ప్రతి కోర్సులో 60 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లు ఉన్నాయని చెప్పారు. ఈ మొత్తం సీట్లలో 70% సీట్లు అనాధ, నిరాశ్రయ బాలికలకు కేటాయించబడినట్లు, అలాగే 3% సీట్లు దివ్యాంగులకు కేటాయించినట్లు తెలిపారు. అర్హతగా కనీసం పదవ తరగతి ఉత్తీర్ణత ఉండాలని, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష రాయకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత విద్యతో పాటు వసతి సౌకర్యం కూడా కల్పించబడుతుందని తెలిపారు. కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, తల్లిదండ్రుల మరణ ధృవీకరణ పత్రం, సంబంధిత సంస్థ నుండి బోనఫైడ్ సర్టిఫికేట్, టీసీ,అధ్యయన ధృవీకరణ పత్రం,పదవ తరగతి మార్కుల మెమో సమర్పించాలన్నారు. అభ్యర్థులు అవసరమైన ధృవీకరణ పత్రాలతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను మే 25,2026లోగా హైదరాబాద్‌లోని డైరెక్టర్, మహిళాభివృద్ధిశిశు సంక్షేమ శాఖ #8-3-222,మధురానగర్, సారథి స్టూడియో సమీపంలో,



యూసఫ్ గూడ,అమీర్‌పేట్, హైదరాబాద్ -500038 కార్యాలయానికి పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు గద్వాల పాత కలెక్టరేట్‌లోని బాలరక్షా భవన్‌ను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

# హత్నూరలో నత్త నడకన వరిధాన్యం కొనుగోళ్లు

**- డిసిఓ, ఎంపీడీవో, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు**

**హత్నూర, మే21 (జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలో వరి ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ కొరడా ఝుళిపించారు. ధాన్యం సేకరణలో తీవ్ర జాప్యం వహిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సంబంధిత జిల్లా సహకార అధికారి కిరణ్ కుమార్, హత్నూర ఎంపీడీవో శంకర్,ఏపీఓ రాజశేఖర్‌లకు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ మందకొడిగా సాగడానికి అధికారుల నిర్లక్ష్యమే కారణంగా భావిస్తూ నోటీసుల జారీకి ఉపక్రమించినట్లు తెలుస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద కొరవడిన పర్యవేక్షణ, సమన్వయ లోపం, అధికారుల వైఫల్యం కారణంగా రైతులు ఇబ్బందులకు గురవుతున్న విషయం వారి దృష్టికి వచ్చిందని ఈ విషయమై పలుమార్లు అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎలాంటి మార్పు కనిపించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఈ విషయంలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మూడు రోజులలోగా తమ వివరణ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

## తూకం వేసి వారం రోజులు
# గడుస్తున్న పట్టించుకోని అధికారులు

- అంసాన్ పల్లి పోతిరెడ్డిపల్లి కొంగోడు గ్రామాల రైతుల ఆవేదన
- రెండు రోజులలో తూకం వేసిన బస్తాలను రైస్ మిల్లులకు తరలించే ఏర్పాటు చేస్తా: తహసిల్దార్ శ్రీనివాస చారి



**కొల్చారం, మే21 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం వేసి వారం రోజులు గడిచిన కూడా లారీలు రావడం లేదని అంసాన్ పల్లి పోతిరెడ్డిపల్లి కొంగోడు గ్రామాల రైతులు గురువారం తాసిల్దార్ శ్రీనివాస చారిని, ఎస్సై మహమ్మద్ మొయినుద్దీన్‌లను కలిసి మొరపెట్టుకున్నారు. సకాలంలో లారీలు పంపాలని ఆ గ్రామాల రైతులు తహసిల్దార్ ను వేడుకొన్నారు.

**తహసిల్దార్ శ్రీనివాస చారి ఇచ్చిన హామీ..**

ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాసచారి మాట్లాడుతూ రెండు రోజులలో తప్పకుండా లారీలు పంపించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రైతులు కూడా అధికారులతో సహకరించాలని తహసిల్దార్ రైతులను కోరారు. రైతుల వద్ద ట్రాక్టర్లు ఇతర సొంత ట్రాన్స్‌పోర్ట్ సదుపాయాలు ఉంటే ఉపయోగించుకోవాలని సకాలంలో అన్లోడ్ చేసే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కొల్చారం అంసానిపల్లి సొసైటీ చైర్మన్ మన్నే రాములు, సర్పంచులు స్వామి, గీతా రమేష్, ఉప సర్పంచులు , రైతులు తదితరులు పాల్గొన్నారు

## హద్నూర్‌లో
# జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**న్యాల్‌కల్, మే21, (జనంసాక్షి):** మండలంలోని హద్నూర్ సహకార సంఘం కేంద్రంలో గురువారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. స్థానిక సంఘం చైర్మన్ జగన్నాథ్ రెడ్డి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డిలు ప్రారంభించారు. జొన్న పంట సాగుచేసిన రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో డిసిసి బ్యాంక్ మేనేజర్ ధనుంజయ్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ

**- మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు**



**మెదక్ మున్సిపాలిటీ, మే21 (జనంసాక్షి):** సాంకేతిక విద్యకు ప్రాధాన్యమిచ్చి కంప్యూటర్ యుగానికి బాటలు వేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని మెదక్ మున్సిపల్ చైర్ పర్సన్ కానుగు రాధిక భూపతి రాజు అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ రాజీవ్ గాంధీ 35వ వర్ధంతి సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందుగుల గంగాధర్ గారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ కానుగు రాధికా భూపతి రాజు మాట్లాడుతూ కేవలం 40 సంవత్సరాలకే చిన్న వయసులోనే భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టి దేశాన్ని ఆధునిక భారతదేశ నడిపించిన దూరదృష్టి కల నాయకుడు రాజీవ్ గాంధీ అన్నారు. ఈ కార్యక్రమంలో కానుగు భూపతి రాజు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి అశోక్ , సయ్యద్ ఉమర్, బుద్ధ రాజు, పిల్లి కొట్టాల నాగరాజు, దేవుల నాయక్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**- మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి**



**మునిపల్లి, మే 21(జనంసాక్షి):** రైతులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాయికోడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ మంతూర్ సుధాకర్ రెడ్డి అన్నారు. గురువారం మునిపల్లి మండలంలోని తాటిపల్లిలో ఏ ఆర్ఎస్‌కె కేంద్రంలో రైతులకు జనుము, జీలుగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సతీష్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విత్తనాలను అందుబాటులో ఉన్నాయని, రైతులు తప్పనిసరిగా ఆధార్‌కార్డు, పట్టాదారు పాస్‌బుక్‌తో విత్తనాలను పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద చెల్మెడ పీఏసీఎస్ మాజీ చైర్మన్ పెద్దలోడి విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల సీనియర్ నాయకులు వెంకట లక్ష్మారెడ్డి, మక్సూద్ పటేల్, గ్రామ సర్పంచ్ రాములు, పీఏసీఎస్, ఏఎంసి డైరెక్టర్లు సంజీవ్ రెడ్డి, మహిపాల్, రైతులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రిప్ డీలర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఏకగ్రీవం

**- జిల్లా అధ్యక్షుడిగా శరణయ్య స్వామి**



**సంగారెడ్డి ప్రతినిధి, మే21, (జనంసాక్షి):** డ్రిప్పు డీలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని అతిథి భవనంలో ఏర్పాటుచేసిన సమావేశానికి జిల్లాలోని డ్రిప్ డీలర్స్ యజమానులు సమావేశమై కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా న్యాల్‌కల్ మండలం, మామిడిగి గ్రామానికి చెందిన శరణయ్య స్వామి, జిల్లా గౌరవ అధ్యక్షుడిగా రాయికోడ్ మండలం, సంగాపూర్ గ్రామానికి చెందిన అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా జహీరాబాద్ మండలం, అల్గోల్ గ్రామానికి చెందిన కొండల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శిగా న్యాల్‌కల్‌కు చెందిన విజయ్‌కుమార్, జిల్లా కోశాధికారిగా కుసునూర్‌కు చెందిన విశ్వనాథ్‌లతో మరో 28 గురితో కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన డ్రిప్పు డీలర్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చొద్దు..

**- మండల వ్యవసాయ అధికారి శ్వేతా కుమారి**

**కొల్చారం, మే21 (జనంసాక్షి):** నిప్పుపెడితే భూమి సారాన్ని కోల్పోతుంది. దిగుబడి తగ్గుతుంది. ప్రకృతి సమతుల్యత దెబ్బతింటుందని మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి తెలిపారు. పొలాన్ని కలియ దున్నితేనే పంటకు మేలు గతంలో వరి పంటను కొడవళ్లతో మొదళ్ల దాకా కోసేవారు. అంతేకాకుండా పశువులు ఎక్కువగా ఉండటంతో గడ్డిని కుప్పలుకుప్పలుగా పశుగ్రాసం కోసం నిల్వ చేసేవారు. అయితే ప్రస్తుతం సాగు విధానంలో అనే క మార్పులొచ్చాయి. పశువుల సంఖ్య తగ్గిపోవడంతో యంత్రాలను విరివిగా వినియోగిస్తున్నారు. మిషన్‌తో హార్వెస్టింగ్ చేసే సమయంలో పైకి కోయడం ద్వారా కొయ్యలు పెద్దగా మిగిలిపోతున్నాయి. అవసరమున్న రైతులు కొంత గడ్డిని కోసి తీసుకొచ్చుకుని మిగిలిన దానిని అక్కడే వదిలేస్తున్నారు దీంతో దున్నే సమయంలో నాగళ్లకు అడ్డుగా వస్తున్నాయని రైతులు వరికొయ్యలతోపాటు గడ్డిని కూడాకాలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనివల్ల అధిక నష్టాలు వచ్చే అవకాశముందని అన్నారు. సింగిల్ సూపర్ ఫాస్పేట్ చల్లితే వరికొయ్యలు, గడ్డి మొక్కలు తొందరగా కుళ్లిపోతాయి. మురిగిన కొయ్యలు ఎరువుగా మారడంతో దిగుబడి పెరుగుతుందని మండల వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి తెలిపారు.

## రైస్‌మిల్లర్లు లారీలను వెంటవెంటనే అన్‌లోడ్ చేయాలి

**- మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్**



**పెద్ద శంకరంపేట, మే21 (జనంసాక్షి):** రైస్‌మిల్లర్ల యజమానులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన లారీలను వెంట వెంటనే వరి ధాన్యాన్ని దించుకోవాలని అనంతరం ఆ లారీలను వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు పంపించాలని మెదక్ జిల్లా అడిషనల్ కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం సాయంత్రం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని అట్టులుర్ వద్ద సప్తగిరి రైస్ మిల్లు ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేయాలని లారీల కొడత లేకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట పీట తాసిల్దార్ ప్రభుదాస్. రైస్ మిల్లర్లో యజమానులు ఎర్రం రమేష్ గుప్తా. పరమేశ్వర్ గుప్తా. తాసిల్దార్ సిబ్బంది పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య



**పాపన్నపేట, మే 21 (జనంసాక్షి):** కుటుంబ కలహాలు సంతాన లేమి తో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చీకోడ్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు,కుటింబబీకుల సమాచారం మేరకు వివరాలు.. బోయిని పర్వయ్య, అనూషమ్మలకు ఇరువురు కుమారులు కాగా పెద్ద కుమారుడు సంగమేశ్వర్, చిన్న కుమారుడు సాయిబాబా (32)లు కాగా ఇరువురి కుమారులకు వివాహాలు చేశారు. బుధవారం భార్య భర్తల మధ్య గొడవ చేసుకోవడంతో మధ్యాహ్నం ఇంటిలోని గదిలోకి వెళ్ళి గడియ వేసుకోవడంతో అనుమానం వచ్చిన భార్య వాసవి,అత్త అనుషమ్మ కు తెలుపడంతో ఇరువురు వెళ్ళి గడియ తీయాలని పిలిచినా పలుక కాపోవడంతో పెద్ద కుమారుడు సంగమేశ్వర్ సహాయంతో గడ్డపార తలుపులు తెరిచి చూడగా దూలనికి చీరతో ఊరి వేసుకొని ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి అనూషమ్మ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ వెల్లడించారు.

## నేడు ముఖ్యమంత్రి - కార్మిక శాఖ మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



**కొల్చారం, మే 21 (జనంసాక్షి):** తెలంగాణలోని 1 కోటి 11 లక్షల మంది కార్మికులకు శుభవార్త చెప్పి, కార్మికుల కనీస వేతనాలను పెంచుతూ రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నట్లు కొల్చారం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగుల గారి మల్లేశం గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా కార్మికుల కనీస వేతనాల పెంపు జూన్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుందని తెలిపారు. కనీస వేతనాలు పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి కార్మికులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కార్యకర్తలు ఇది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం తీసుకున్న అతి గొప్ప నిర్ణయం కనుక నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రెడ్డిపల్లి ఆంజనేయులు గౌడ్ ఆదేశాల మేరకు కొల్చారం మండల కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10గంటలకు కొల్చారం మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మికశాఖ మంత్రి వర్యులు డా.వివేక్ వెంకటస్వామి ఫోటోలకి పాలాభిషేకం కార్యక్రమం ఉన్నది. కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గ సభ్యులు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఉప సర్పంచులు వార్డు సభ్యులు సింగిల్ విండో చైర్మన్లు ముఖ్య నాయకులు ఎన్ ఎస్ యు ఐ నాయకులు యువజన కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# రైతు ఆత్మహత్య అనే వార్తలు అవాస్తవం

**- రైతులు ధైర్యంగా ఉండాలి**

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా బ్యూరో చీఫ్, మే 21 (జనంసాక్షి):** జిల్లాలో ఇటీవలే ధాన్యం కొనుగోలు కారణంగా రైతు ఆత్మహత్య అనే వార్తలు అవాస్తవమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఖండించారు. ధాన్యం కొనుగోలు సందర్భంలో రైతు ఆత్మహత్య అనే కథనంపై జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆమె మాట్లాడారు కుటుంబ కలహాలు వివిధ కారణాలతోనే జరిగినట్లుగా తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి కొన్ని పత్రికల్లో ప్రచురితమైన వార్తల నేపథ్యంలో వాస్తవ పరిస్తితి నివేదిక ప్రకారం రైతు తన కుటుంబం లోని కలహాల కారణంగా ఆత్మహత్య కి పాల్పడినట్లు తెలిసినది. ఇందులో ధాన్యం కొనుగోలు చేయకపోవటం కారణంగా ఆత్మహత్య చేసుకున్నాడు అన్నది అవాస్తవం. అని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోలు ప్రక్రియ నిరంతరం కొనసాగుతోంది. ఇప్పటి వరకు సుమారు 2 లక్షల 11 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగి, రైతుల ఖాతాల్లో రూ.311 కోట్లను 28,521 మంది రైతులకు నేరుగా జమ చేయడం పూర్తయిందని వెల్లడించారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతుల సౌకర్యార్థం సీరియల్ విధానంలోనే ధాన్యం కొనుగోలు జరుగుతోంది. ధాన్యం రవాణా, మిల్లులకు కేటాయింపు, అన్‌లోడింగ్ తదితర ప్రక్రియలు పరిస్థితులకు అనుగుణంగా సమన్వయం చేస్తూ నిర్వహించబడుతున్నాయన్నారు.. కొన్ని ప్రాంతాల్లో ఒకేసారి అధికంగా ధాన్యం రావడం వల్ల తాత్కాలికంగా ఆలస్యం జరిగిన సందర్భాలు ఉన్నప్పటికీ, వాటిని వెంటనే పరిష్కరించే చర్యలు తీసుకోవడం జరుగుతోంది. అదేవిధంగా సంబంధిత సివిల్ సప్లైస్ అధికారులు, తహసీల్దార్లు మరియు ఇతర శాఖల అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు. రైతులకు చెల్లింపులు కూడా నిరంతరంగా జరుగుతున్నాయి.

కావున రైతులు ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. రైతులు ధాన్యం కొనుగోలు ఆలస్యం పట్ల ఎటువంటి ఆందోళనకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని విజ్ఞప్తి చేయడమైనది. ఈ మేరకు సంబంధిత అధికారులకు వేగవంతంగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసి మిల్లులకు తరలించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించడమైనది మరియు ఇటువంటి పరిస్థితిలలో రైతులకు ధైర్యం చెప్తూ, తగు చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. .

## న్యాల్‌కల్‌లో జొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం



**న్యాల్‌కల్, మే 21 (జనంసాక్షి):** న్యాల్‌కల్‌లోని సహకార సంఘం కేంద్రంలో గురువారం జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశం మేరకు స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, డిసిసి బ్యాంక్ మేనేజర్ ధనుంజయ్, తదితరులు ప్రారంభించారు. జొన్న పంట సాగుచేసిన రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని అర్హత కలిగిన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సహకార సంఘం చైర్మన్ రైతులకు సూచించారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సిఐ జక్కుల హనుమంతు, ఎస్సై సుజిత్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు శ్రీనివాస్ రెడ్డి, రైతులు వీరన్న, అంజి, భద్ర స్వామి, శ్రీనివాస్, సురేష్, సంఘం కార్యదర్శి బసవరాజ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య..



**నిజాంపేట, మే21 (జనంసాక్షి):** కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మెదక్ జిల్లా నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మానసిక ఆందోళనకు గురై చల్మెడ గ్రామానికి చెందిన చాకలి రవి (44) అను వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈనెల 17వ తేదీన ఇంటి నుండి వెళ్లిపోయాడు. మృతుని భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

## రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్‌గా ఎన్నికైన కాసోజు శంకరమ్మ



**జనంసాక్షి/హైదరాబాద్:** తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు (అమరుడు) కాసోజు శ్రీకాంతాచారి మాతృమూర్తి కాసోజు శంకరమ్మను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ గా నియమించిన విషయం తెలిసిందే. కాగా గురువారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్‌గా శంకరమ్మ బుద్ధ భవన్‌లోని వారి కార్యాలయంలో సంఘం నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి శాలువా పూలమాలతో సన్మానం చేసి అభినందించడం జరిగిందని జగన్నాథం తెలిపారు. ఈ సందర్భంగా జగన్నాథచారి మాట్లాడుతూ మలిదశ తెలంగాణ ఉద్యమంలో కాసోజు శ్రీకాంత్ ఆచారి చేసిన త్యాగ ఫలితం ఫలితంగా శంకరమ్మను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి కమిషన్ మెంబర్గా బాధ్యతలు ఇవ్వడం రాష్ట్రంలోని విశ్వకర్మలు అందరికీ సంతోషకర విషయమని జగన్నాథం చారి గుర్తు చేశారు. ఉందని అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ గౌరవ సలహాదారు కనపర్తి లక్ష్మణ్‌చారి, ఉపాధ్యక్షులు కాసోజు శ్రీనివాస్ చారి,మహిళా అధికార ప్రతినిధి కస్తోజు శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## కంటైనర్ లారీలో 8 కార్లు దగ్ధం



**తూప్రాన్ మే 21 (జనంసాక్షి):** మెదక్ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెదక్ జిల్లా తూప్రాన్ 44వ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నాగులపల్లి బ్రిడ్జి వద్ద గురువారం మధ్యాహ్నం కంటైనర్ లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కంటైనర్ తూప్రాన్ శివారుకు రాగానే డ్రైవర్ క్యాబిన్ నుండి మంటలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమై దానిని ఆపేశారు నాగపూర్ నుండి కాకినాడ వైపు వెళ్తున్న కంటైనర్ లారీలో మొదట క్యాబిన్ నుండి మంటలు చెలరేగాయి. మంటలు పూర్తిగా లారీ మొత్తం వ్యాపించి కంటైనర్ లారీకి అంటుకోవడంతో పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. కంటైనర్ లారీలో ఉన్న 8 కొత్త కార్లు అగ్నికి పూర్తిగా ఆహుతి అయ్యాయి. రామాయంపేట నుండి ఫైర్ ఇంజన్ వచ్చేలోపు పూర్తిగా కార్లు ఖాళీ బూడిది అయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ట్రాఫిక్‌ని నియంత్రించి మంటలను ఆర్పి వేశారు. సంఘటన స్థలాన్ని తూప్రాన్సి వెంకట్ రాజు సంతోషించారు. తూప్రాన్ ఎస్ఐ గంగరాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# లింగాల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ధాన్యం కొనుగోళ్లు, ఇందిరమ్మ ఇండ్లపై కీలక ఆదేశాలు
- లింగాల మండలంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- ధాన్యాల కొనుగోలు కేంద్రాల పరిశీలన
- ధాన్యం కొనుగోళ్లలో పారదర్శకత ముఖ్యం
- ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల్లో నాణ్యత పాటించాలి
- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**లింగాల మే 21,(జనంసాక్షి):** నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని లింగాల మండల కేంద్రంలో పలు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ గురువారం ఉదయం ఆకస్మికంగా పరిశీలించారు. మొక్కజొన్న, వరి కొనుగోళ్లకు రైతులకు అందుతున్న సేవలు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పురోగతి, గ్రామ స్థాయిలో కొనసాగుతున్న జనగణన కార్యక్రమంపై ప్రత్యక్షంగా పరిశీలించి, వివరాలను సేకరించి, సమీక్ష నిర్వహించి సంబంధిత శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు.

ముందుగా లింగాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ వరి, మొక్కజొన్న ధాన్యాల కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసే విధానం, తూకం ప్రక్రియ, నాణ్యత ప్రమాణాలు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని, రైతులకు చెల్లింపులు ఆలస్యం కాకుండా తక్షణమే వారి బ్యాంకు ఖాతాల్లో జమయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రైతులు గంటల తరబడి వేచి ఉండకుండా సరైన ప్రణాళికతో కొనుగోళ్లు నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, ప్రతి గింజ ధాన్యాన్ని కొనుగోలు చేసే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ధాన్యం తరలింపు ప్రక్రియకు అవసరమైన లారీలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, రైతులు ధాన్యం విక్రయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాలని, కొనుగోలు కేంద్రాల్లో తాగునీరు, నీడ, తార్పులు వంటి కనీస సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనంతరం లింగాల గ్రామంలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇండ్లు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను సందర్శించిన కలెక్టర్ పనుల పురోగతిని పరిశీలించారు. లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న సహాయం, నిర్మాణ సామగ్రి లభ్యత, పనుల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు తెలుసుకున్నారు. ఇండ్ల నిర్మాణాలను నాణ్యత ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు.



లబ్ధిదారులకు సామాగ్రి, ఇసుక, ఇతర అవసరమైన నిర్మాణ సామగ్రి సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని, పనులు మధ్యలో నిలిచిపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం పేదలకు గౌరవప్రదమైన నివాస వసతి కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అమలు చేస్తోందని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రెండోవ విడతలో ప్రభుత్వం అందజేసే ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

ఈ కర్యక్రమామలో సింగిల్ విండో ప్రెసి డెంట్, హనుమంతు రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వెంకటగిరి, సర్పంచ్ ఈశ్వరమ్మ, యం.పి.డీ.ఓ చంద్రశేఖర్, యం.ఆర్.ఓ వెంకటేష్, యం.ఈ.ఓ బషీర్ అహమ్మర్ మాజీ సర్పంచ్ కె.తిరుపతయ్య, లింగాల మండల ప్రజా ప్రతినిధిలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం

- బిజెపి జిల్లా అధ్యక్షుడు మల్లేష్ గౌడ్

**మెదక్ మే21 (జనంసాక్షి):** ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తి విఫలం అయిందని మెదక్ బిజెపి జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు మెదక్ అదనపు కలెక్టర్ నగేష్ కు వినతి పత్రం సమర్పించి ప్రతి సెంటర్కు శ్రీశీ తొందర లారీలు పంపించి అన్లోడ్ తొందరగా అయ్యేటట్టు చూడాలని వారు అదనపు కలెక్టర్ నగేష్ ను కోరారు అనంతరం మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలు పూరిత విప్లవం అయిందని చిన్న శంకరం పేట మండలం అంబాజీ పల్లి గ్రామానికి చెందిన రాజయ్య మృతి ప్రభుత్వమే కారణమని అతని ధాన్యం కొనుగోలు కాలేదని తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలని ఆవేదన గురై ఆత్మ వేసుకున్నాడని అతని ఆత్మహత్య ప్రభుత్వం హత్యగా గుర్తించి ప్రభుత్వా ని విమర్శించారు రాజయ్య కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని అతనికి నష్టపరియం ఇవ్వాలని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఎమ్మార్వో కు మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ లకు ఫోన్ చేసి పేపర్లో వేయించుకోవడం కాదు నిన్ను నమ్మి ఇక్కడ ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు ప్రతి ఐకెపి సెంటర్ మరియు సొసైటీ సెంటర్లకు వెళ్లి లోడింగ్ అన్లోడింగ్ పరిశీలించాలని ఓన్లీ ఫోన్ల ద్వారా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అనడం కాదు ఎమ్మెల్యే విడ్డూరంగా ఉందని ఆయన మండిపడ్డారు వెంటనే సెంటర్లకు లారీలను పంపించి లోడింగ్ మరియు రైస్ మిల్లర్లు తొందరగా అన్లోడింగ్ చేసుకునేటట్టు చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక ఎమ్మెల్యేను కలెక్టర్ కోరారు లేదంటే బిజెపి పార్టీ రైతుల పక్షాన కలెక్టరేట్ ముట్టడిస్తామని ఆయన



హెచ్చరించారు ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి ఎం ఎల్ ఎన్ రెడ్డి బిజెపి కిషన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు బైండ్ల సత్యనారాయణ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ బీజీవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్ పటేల్ పంజావిజయ్ కుమార్ పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ బెండల వీణ బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# జిల్లాలో వైభవంగా ప్రారంభమైన ఉచిత టైలరింగ్ కార్యక్రమం

**గద్వాల నడిగడ్డ,మే 21 (జనంసాక్షి);** గ్రామీణ మహిళలు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఆర్ఎస్ఈటిఐ శిక్షణలు ఎంతో దోహదపడతాయని యూబీఐ-ఆర్ఎస్ఈటిఐ డైరెక్టర్ డి.ఎమ్.శ్రీనివాస్ నాయక్ అన్నారు. గురువారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా 31 రోజుల ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామీణ మహిళలు నైపుణ్యాభివృద్ధి ద్వారా ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించేందుకు ఆర్సెఈటిఐ శిక్షణలు ఎంతో దోహదపడుతున్నాయని అన్నారు. శిక్షణ అనంతరం మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు స్థాపించేందుకు బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.ఉద్యోగాలు వెతికే స్థాయి నుండి ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని శిక్షణార్థులను ప్రోత్సహించారు. తొలి బ్యాచ్‌లో 30 మంది గ్రామీణ మహిళలకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.31 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో ప్రొఫెషనల్ టైలరింగ్‌తో పాటు వ్యాపార నిర్వహణ,స్వయం ఉపాధి అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పిస్తామన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అభ్యర్థులకు భారత ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ధృవీకరించిన సర్టిఫికెట్లు



అందజేయబడతాయని అన్నారు.జిల్లాలో ఇప్పటికే ఆర్సెటి శిక్షణల ద్వారా అనేక మంది యువతీ యువకులు విజయవంతమైన స్వయం ఉపాధిదారులుగా నిలిచారని పేర్కొన్నారు. శిక్షణార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమ శిక్షణతో శిక్షణను పూర్తిచేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎల్.శ్రీనివాసరావు,ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్,జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎన్.చరణ్, అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసులు, డీపీఎం సలోమి,తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల నిర్మూలనకు టూ టౌన్ పోలీసుల ప్రత్యేక తనిఖీలు

- ఇన్స్పెక్టర్ ఇజాజ్‌ఉద్దీన్



**మహబూబ్‌నగర్ రూరల్ మే 21 (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నార్కోటిక్ జాగిలం రుద్ర సహాయంతో టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్ పోలీసు సిబ్బంది కలిసి మోటర్ లైన్స్ లోని ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయం తో పాటు ఇతర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగింది. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా మరియు వినియోగం జరగకుండా నిరోధించేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. అదేవిధంగా పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు ఎలాంటి టొబాకో ఉత్పత్తులు, గుట్కా, సిగరెట్లు విక్రయించరాదని స్పష్టమైన సూచనలు ఇవ్వడం జరిగింది. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్‌శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని, ప్రజలు కూడా అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# మండల కేంద్రంలో "తువ్వాల" పాట పోస్టర్ విడుదల



**ఊర్కొండ మే 21, (జనంసాక్షి);** ఊర్కొండ మండల కేంద్రంలో తువ్వాల పాట పోస్టర్ విడుదల చేశారు. తువ్వాల మనిషి పుట్టుక నుండి మరణం వరకు తోడుగా ఉంటుందని దాని ప్రత్యేకత చాటుతూ కవి ,రచయిత రామ్ పెరుమాండ్ల తువ్వాల పాట రచించారు. పాటకు నిర్మాతగా మాదారం సర్పంచ్ చిక్కొంద్ర మల్లేష్ మాధారం సర్పంచ్ ,. గానం కేషమళ్ల అనిల్ పెద్దపూర్, కొరస్ సురేష్ ఎల్లికంటి ,నరేష్ నాయక్ వాడిత్యవత్ పాడారు. ఈ కార్యక్రమంలో ఊర్కొండ గ్రామ సర్పంచ్ మంజుల శ్రీనివాస్ ,ఉప సర్పంచ్ పోలే రాజు ,మాధారం సర్పంచ్ చిక్కొంద్ర మల్లేశ్ ,సంతోష్, సందీప్ పి కే మెలోడీస్ యూట్యూబ్ ఛానెల్ వారు తదితరులు పాల్గొన్నారు. పాట విడుదల పట్ల మండల ప్రజలు ఆనందం వ్యక్తంచేశారు. తప్పక అందరూ ఆదరించాలని కోరారు.


## భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి

**అమరచింత, మే 21(జనంసాక్షి):** గురువారం పట్టణ, కేంద్రంలో మం డల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.ఆధునిక భారత దేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ చేసిన



సేవలు చిరస్మరణీయం దేశంలో సమాచార,సాంకేతిక రంగానికి బలమైన పునాదులు వేసి, యువతకు నూతన అవకాశాల దారులు చూపిన మహానేత రాజీవ్ గాంధీ. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు శ్యామ్ , కమలాకర్ గౌడ్ ఎస్టీ సెల్ మండల అద్యక్షుడు హన్మంతు నాయక్ కిసాన్ సెల్ మండల అద్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎండల తీవ్రత.. ప్రజలు ఉక్కిరిబిక్కిరి





సంగారెడ్డి టౌన్ మే 21 (జనంసాక్షి):
రాష్ట్రవ్యాప్తంగా రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఉదయం నుంచే మండిపోతున్న ఎండలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్న సమయంలో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, కూలీ కార్మికులు, ప్రయాణికులు ఎండ వేడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పలుచోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకుపైగా నమోదవుతున్నాయి.
వైద్యులు, అధికారులు ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. అత్యవసర పరిస్థితులు లేకపోతే మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకు బయటకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఎండ వేడికి వడదెబ్బ ప్రమాదం ఎక్కువగా ఉండటంతో జాగ్రత్తలు తప్పనిసరి అంటున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు :**
తరచుగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు వంటి ద్రవాలు తీసుకోవాలి
బయటకు వెళ్లేటప్పుడు గొడుగు, టోపీ లేదా తల కప్పుకునే వస్త్రం ఉపయోగించాలి
లేత రంగుల పత్తి దుస్తులు ధరించాలి
ఖాళీ కడుపుతో ఎక్కువసేపు ఎండలో తిరగకూడదు
పిల్లలు, వృద్ధులను ప్రత్యేకంగా జాగ్రత్తగా చూసుకోవాలి
వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి
ఎండల తీవ్రత మరికొన్ని రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి సిబ్బందికి శిక్షణ



మహబూబ్‌నగర్ బ్యూరో మే 21 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం నిర్వ హిస్తున్న జిల్లా, డివిజన్, స్థాయి ప్రజా వాణిలో అందుతున్న ఫిర్యాదులను సత్వరంగా పరిష్కరించేందుకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా ఆదేశాల మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయ సమా వేశ మందిరంలో కంప్యూటర్ ఆపరేటర్లు, జూనియర్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ పాల్గొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లాలోని అన్నిశాఖల నుండి అలాగే ఎం.పి.డి.ఓ, తహసీల్దార్ కార్యా యాల నుంచి ఒక్కో కంప్యూటర్ ఆపరేటర్, ఒక్కో జూనియర్ అసిస్టెంట్ కు ప్రజావాణి సి.జి.జి పోర్టల్‌పై సమగ్ర శిక్షణ అందించారు. ఈ సంద ర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడు తూ, శిక్షణలో వివరించిన అంశాలను సిబ్బంది పూర్తిగా అవగాహన చేసుకొని, ఇచ్చిన సూచనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను 30రోజుల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## జీలుగ విత్తనాల పంపిణీ రైతులు సద్వినియోగం చేసుకోవాలి

అమరచింత, మే 21 (జనంసాక్షి): గురువారం మండలంలోని రైతులు వ్యవసాయ భూముల్లో కర్బన శాతాన్ని పెంచి, నేల సారాన్ని మెరుగు పరచడానికి పచ్చిరొట్ట ఎరువుల పంటలు ఎంతో ఉపయోగకరము, ఉంటుందని ముఖ్యంగా జీలుగ పంటను పచ్చిరొట్ట ఎరువుగా సాగు చేయడం ద్వారా నేలలో నత్రజని స్థిరీకరణ జరిగి, భూమి ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గుతుంది. జీలుగ పంట వేగంగా పెరిగి అధిక పచ్చి జీవపదార్థాన్ని అందించడం వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది. జీలుగ విత్తనాల పూర్తి ధర క్వింటాల్‌కు రూ.16,350 కాగా, ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై క్వింటాల్‌కు రూ.8,175 మాత్రమే రైతులకు అందజేయబడుతుంది. 30 కేజీల బస్తా ధర 2453/- రూపాయలు. జీలుగా విత్తనాలు నాని అరస్క్ 01 అమరచింత,అరస్క్ 02 నాగల కదు మూరు, హాక 01 అమరచింత, హాక 02 ప్రియదర్శిని, నందిమల్ల ఎక్స్ రోడ్ కిష్టంపల్లి, హాక 03 కిష్టంపల్లి 5 కేంద్రాల్లో అందుబాటులో ఉన్నా యి. రైతులు తమ క్లస్టర్ పరిధిలోని ఏవోలను సంప్రదించి పర్మిట్ తీసు కుని విత్తనాలను పొందగలరు. అధిక ప్రయోజనాలు కలిగిన పచ్చిరొట్ట ఎరువుల పంటలకు రైతులు విస్తృతంగా సాగుచేసి నేల ఆరోగ్యాన్ని కాపా డుకోవాలని వ్యవసాయశాఖ ద్వారా విత్తనాలను తీసుకోవడానికి ఇవ్వ వలసిన జిరాక్స్ డాక్యుమెంట్స్, పట్టాదారు. పాసుపుస్తకం,ఆధార్ కార్డు రైతులు వ్యవసాయ అధికారి ఏవో అరవింద్ నుసంప్రదించగలరు.

## చదువుకు ప్రోత్సాహం..విద్యార్థుల ఉత్సాహం

- ఉత్తమ విద్యార్థులకు..ప్రతిభా పురస్కారాలు..
- 14 మంది విద్యార్థులకు సత్కరించిన ఐ ఫౌండేషన్
- రవీంద్ర భారతి వేదికగా ఎంపీ, ఎమ్మెల్సీ విద్యార్థులకు సత్కారం



సంగారెడ్డి, 21మే (జనం సాక్షి): ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థు లకు ప్రోత్సాహం లభించ డంతో విద్యార్థులు ఉత్సా హంగా చదువులో ముం దుకు వెళ్తున్నారు. సంగా రెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ జడ్.పి.హెచ్.ఎస పాఠశాల విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో మూడు ర్యాంకు లు సాధించారు. ఈ సందర్భంగా ఐ ఫౌండేషన్ ప్రతిభ పురస్కారాలు 2026 ద్వారా విద్యార్థులను సత్కరించారు. 560 మార్పులు సాధించిన మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులకు హైదరాబాదులోని రవీంద్ర భారతిలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి,ఎమ్మెల్సీ కోదండరాం చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు పొందారు. ఐ ఫడేషన్ వ్యవస్థాపకులు రవీందర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

## ప్రగతిశీల భారత నిర్మాణమే రాజీవ్ గాంధీకి నిజమైన నివాళి

- ఐటీ రంగానికి రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం
- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



వనపర్తి బ్యూరో మే 21 (జనంసాక్షి): మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం వనపర్తి జిల్లా కేంద్రం రాజీవ్ చౌక్ లో గల రాజీవ్ గాంధీ విగ్రహానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పూలువేసి, దేశానికి ఆయన చేసిన త్యాగా లను, సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళు లర్పించారు.చిన్నారెడ్డి మాట్లాడుతూ దేశ సమగ్రత, శాంతి, ప్రజాస్వామ్య విలువలు పరిరక్షణ కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు రాజీవ్ గాంధీ అని అన్నారు. యువతకు ఓటు హక్కు కల్పిం చడంతో పాటు ఐటీ రంగాన్ని దేశానికి పరిచయం చేసి భారతదేశ ముఖచిత్రాన్ని మార్చిన మహోన్నత నాయకుడు రాజీవ్ గాంధీ అని తెలిపారు.రాజీవ్ గాంధీ హయాంలో గ్రామపంచాయతీలకు అన్ని హక్కులు కల్పిస్తూ పల్లెలు, తాండాలు అభివృద్ధి జరిగే విధంగా కృషి చేశారని అన్నారు.దేశంలోని ప్రముఖ ప్రభుత్వ విభాగాల్లో కంప్యూటర్ల వినియోగాన్ని ప్రారంభించిన తొలి నాయకుడు రాజీవ్ గాంధీ అని దాని ఫలితంగా టెలికాం, బ్యాంకింగ్, విద్యా రంగాల లో ఆధునీకరణ మొదలైంది అని అన్నారు.రాజీవ్ గాంధీ వర్ధంతిని దేశవ్యాప్తంగా ఉగ్రవాద వ్యతిరేక దినోత్సవంగా పాటిస్తున్న సందర్భంగా ప్రతి భారతీ యుడు హింసకు వ్యతిరేకంగా, శాంతి సామరస్యం సౌభ్రాతృత్వాన్ని పరిరక్షించాలని అన్నారు.సమైక్యతే మన శక్తి శాంతియుత భారతమే మన లక్ష్యం అని దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు.దేశ ప్రధానిగా నరేంద్ర మోడీ గారు విఫలం అయ్యారని, దేశ ప్రజలకు ప్రత్యామ్నాయ ఆశగా రాహుల్ గాంధీ ఎదుగుతున్నారని, రానున్న రోజుల్లో ఆయన దేశ ప్రధానమంత్రి కావడం ఖాయ మని చిన్నారెడ్డి గారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీమాజీ అధ్య క్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా కాం గ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తిరుపతయ్య, వనపర్తి జిల్లా ప్లీడర్ కిరణ్ కుమార్, వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రెటరీ బ్రహ్మం, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, వనపర్తి సింగల్ విండో మాజీ అధ్యక్షులు సహదేవుడు, వనపర్తి జిల్లా ఏఐపిసి అధ్యక్షుడు నాగా ర్జున, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, వన పర్తి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, కౌన్సిలర్ పీతంబర్ నాయక్ ,వనపర్తి మండల్ ఎన్ ఎస్‌యూఐ అధ్యక్షుడు ఎత్తం చరణ్ రాజ్, సీనియర్ నాయకులు పాండురావు, యాదగిరి, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## చారిత్రక కట్టడాల పరిరక్షణ అందరి బాధ్యత

- జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ




వీపనగండ్ల, మే 22 (జనంసాక్షి): జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యం లో సోమశిల గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో కలిసి దేవస్థానం వరకు హెరిటేజ్ వాక్ కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొ న్న జిల్లా పర్యాటక అధికారి కల్వరాల నరసింహ, గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి, సోమశిల గ్రామానికి జాతీయ స్థాయిలో చాలా గుర్తింపు ఉందని గ్రామంలో పురాతన కట్టడాలు ఎన్నో ఉన్నాయని, మన సంపదను కాపాడు కోవాల్సిన బాధ్యత మన మీదే ఉంటుందని గ్రామ ప్రజలకు తెలి పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభు త్వం, తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక పురావస్తు సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చారిత్రక కట్టడాలను రక్షిస్తూ టూరిజంకు చాలా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో పురాతన శాఖ పర్యవేక్షకుడు కురుమ య్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాటం నారాయణ, కాటం మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

## మహోన్నత దార్శనికుడు స్వర్గీయ రాజీవ్ గాంధీ



పటాన్చెరు మే 21 (జనంసాక్షి): భారతదేశాన్ని ఆధునిక ప్రపంచం వైపు నడిపించిన మహోన్నత దార్శనికుడు, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ అని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ కొనియాడారు. గురువారం రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్ లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు ఏర్పాటు చేసిన స్మారక కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నివాళులర్పించి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న 1984--1989 కాలం దేశ చరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గదని, ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక చట్టాలు, దూరదృష్టితో కూడిన విధానాలే నేటి నవభారత ప్రగతికి బలమైన పునాదులని స్పష్టం చేశారు.
మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ, మహిళా రిజర్వేషన్ల ఆలోచనకు ఆయనే శ్రీకారం చుట్టారని, అదే తదనంతర 73, 74 రాజ్యాంగ సవరణలకు మార్గదర్శకమైందని వివరించారు. దేశ సమగ్రత కోసం ప్రాణాలర్పించిన రాజీవ్ గాంధీ ఆశయ సాధన కోసం కాంగ్రెస్ శ్రేణులంతా కట్టుబడి పనిచేయడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని నీలం మధు ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పడమటి గోపాల్ రెడ్డి, సంగన్న గారి గోపాల్, మంజలి దస్తగిరి, అల్లం గారి నరసింహారెడ్డి, సంపత్ రెడ్డి, వెంకటేష్ నాయక్, నారాయణదాసు, మన్నే రాఘవేంద్ర, మణికంఠ, సందీప్ గౌడ్, లక్డారం మాజీ ఎంపిటిసి శ్రీనివాస్, ముత్తంగి అశోక్, వెంకటేష్, మురళి, స్థానిక కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.